ఆదివారం
13-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 53
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మా జీతాలు పెంచాల్సిందే

దిగిరాని ద్రవ్యోల్బణానికి అనుగుణంగా తమ జీతాలు పెంచాలన్న డిమాండ్‌తో బ్రిటన్‌లోని జూనియర్ డాక్టర్లు మరోమారు సమ్మెబాట పట్టారు. నాలుగు రోజుల విధుల బహిష్కరణను ప్రకటించారు. జీతాల విషయంలో బ్రిటిష్ వైద్య మండలి (బీఎంఏ), ప్రభుత్వానికి మధ్య వివాదం నడుమ ఐదవ దశ పారిశ్రామిక చర్యకు జూనియన్ డాక్టర్లు పూనుకున్నారు.

2 లో

అప్రకటిత విద్యుత్ కోతలు

- తీవ్ర ఉష్ణోగ్రతలతో పెరిగిన వినియోగం
- వర్షాభావం, వనరుల కొరతతో తగ్గిన ఉత్పత్తి
- సర్దుబాటు పేరుతో కోతలు అమలు
- ఉక్కపోత, దోమలతో ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో మళ్లీ అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. పది రోజులుగా వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. గతేడాది ఇదే నెలలో రాష్ట్రవ్యాప్తంగా 165 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండగా... ప్రస్తుతం వేసవికాలం తరహాలో 235 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం డిమాండ్ నెలకొంది. మరోవైపు వర్షాభావ పరిస్థితులు, వనరుల కొరత వంటి కారణాలతో విద్యుత్ ఉత్పత్తి తగ్గింది. ప్రస్తుతం రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ అడుగంటడంతో జల విద్యుత్ ఉత్పత్తి తగ్గింది. బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో సామర్థ్యానికి తగిన ఉత్పత్తి జరగడం లేదు. దీంతో ఉన్న విద్యుత్‌ను సర్దుబాటు చేసే ప్రయత్నాల్లో భాగంగా గ్రామాల్లో అనధికార కోతలు విధిస్తున్నారు. సహజంగా ఆగస్టు నెలలో వర్షాలు ఎక్కువగా కురవడం, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు భారీగా వరద రావల్సి ఉంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో కృష్ణా ప్రాజెక్టులన్నీ ఒట్టిపోతున్నాయి. దీంతో జల విద్యుత్ నిలిచిపోయింది. ఇంకోవైపు వేసవి కాలానికి, వర్షాకాలానికి విద్యుత్ వినియోగం సుమారు 60 నుంచి 80 మిలియన్ యూనిట్లు తగ్గాల్సి ఉండగా...వినియోగం పెరగడంతో లోటు ఏర్పడింది.

ఒక్క విజయవాడ సర్కిల్ పరిధిలోనే 90 నుంచి 110 మెగావాట్ల విద్యుత్ లోటు ఏర్పడుతున్నట్లు అధికారులు చెపుతున్నారు. సహజంగా వర్షాకాలం విద్యుత్ కోతలు అమలయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కానీ వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా వినియోగం పెరగడం, ఉత్పత్తి తగ్గడం, ఈ వ్యత్యాసాన్ని అంచనా వేసి భర్తీ చర్యలు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తూ, అప్రకటిత కోతలు విధిస్తుండటంతో వినియోగదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. సమయంతో నిమిత్తం లేకుండా ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరుతో ఎడాపెడా కోతలు విధిస్తుండటంతో ఎప్పుడు కరెంట్ వస్తుందో, పోతుందో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రంలో సుమారు 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కావల్సి ఉండగా బొగ్గు కొరత కారణంగా సగానికి సగం ఉత్పత్తి పడిపోయి 1072 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. అలాగే రాయలసీమ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 1650 మెగావాట్ల సామర్థ్యానికిగాను 1061 మెగావాట్లు, కృష్ణపట్నం విద్యుత్ ప్లాంట్‌లో 2400 మెగావాట్లకుగాను 1008 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే అవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు నిండుకున్నాయి. రోజు వారీ వచ్చే సరఫరాతో అరకొర విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ జరుగుతోంది. అసలే ఉక్కపోత, దానికి తోడు దోమల బెడదను తట్టుకోలేక వృద్ధులు, గర్భిణీలు, చంటి పిల్లలు అవస్థలకు గురవుతున్నారు.

ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు, ముడిసరుకు ధరలు, కస్టమర్ చార్జీల పేరిట పెద్దమొత్తాల్లో వసూలు చేస్తూ, వినియోగానికి తగ్గ విద్యుత్ సరఫరా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోతల్లేకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, నిర్దేశిత సమయం ప్రకారం ముందుగా తెలియజేసి కోతలు విధించాలని వినియోగదారులు కోరుతున్నారు.

'ఢిల్లీ బిల్లు'కు రాష్ట్రపతి ఓకే

- డేటా ప్రొటెక్షన్ బిల్లుకు కూడా
- ముర్ము సంతకంతో చట్ట రూపం

న్యూఢిల్లీ: అత్యంత వివాదాస్పద 'ఢిల్లీ సర్వీసుల బిల్లు' (జాతీయ రాజధాని ప్రాంత సవరణ బిల్లు- 2023) చట్టంగా మారింది. పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం పొందిన ఈ బిల్లుపై తాజాగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతకం చేశారు. దీంతో ఇది ఢిల్లీ సర్వీసుల చట్టంగా అమల్లోకి వచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలో ఐఏఎస్‌లు సహా ప్రభుత్వాధికారుల బదిలీలు, నియామకాలపై ఢిల్లీ ప్రభుత్వానికే నియంత్రణ ఉంటుందని ఈ ఏడాది మేలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వచ్చిన మరుసటి రోజే ఢిల్లీలో అధికారుల బదిలీలపై కేంద్రం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. గ్రూప్ ఏ అధికారుల బదిలీలు, నియామకాలు, క్రమశిక్షణ చర్యలపై నిర్ణయాలు తీసుకోవడానికి జాతీయ రాజధాని సివిల్ సర్వీస్ అథారిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి ఢిల్లీ ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఇందులో సీఎం మినహా మిగిలిన ఇద్దరు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉంటారు. మెజారిటీ సభ్యుల నిర్ణయం ప్రకారం ఉద్యోగుల బదిలీలు, నియామకాలు జరుగుతాయని ఆర్డినెన్స్ తెలిపింది. ఒకవేళ వారి మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే లెఫ్టినెంట్ గవర్నరుదే తుది నిర్ణయమని పేర్కొంది. మొత్తంమీద అధికారమంతా కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుంది. దీంతో ఈ ఆర్డినెన్స్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం తీవ్రంగా మండిపడింది. ఈ ఆర్డినెన్స్ స్థానంలో చట్టం తీసుకొచ్చేలా... పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో 'ఢిల్లీ సర్వీసుల బిల్లు'ను కేంద్రం ప్రవేశపెట్టింది. ఈ

- మిగతా 2 లో

సెప్టెంబరుకల్లా ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్

- ఇళ్లస్థలాల కేటాయింపుపై త్వరలో సీఎం సమీక్ష
- సీఎస్ జవహర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగులందరికీ ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్) కార్డులు సెప్టెంబరు నెలాఖరుకల్లా అందేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి తెలిపారు. మరింత పారదర్శకంగా, పటిష్టవంతంగా ఈ పథకాన్ని అమలు చేస్తామని సీఎస్ స్పష్టం చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంపై శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ పథకం అమలు కోసం వివిధ ఉద్యోగ సంఘాల

- మిగతా 2 లో

మోదీని గద్దె దించడమే ఇండియా లక్ష్యం

- మణిపూర్‌పై ప్రధాని స్పందన బాధాకరం
- వలస కార్మికులకు రక్షణ కరువు
- బీజేపీకి వైసీపీ దాసోహం
- వినయ్ విశ్వం, రామకృష్ణ విమర్శ
- 'రాష్ట్రాన్ని రక్షించండి- దేశాన్ని కాపాడండి' పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- విజయవాడ: మణిపూర్‌లో రాజుకున్న మంటల కారణంగా ఈశాన్య భారతంలో బీజేపీకి, ప్రధాని మోదీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, రానున్న రోజుల్లో మోదీని గద్దెదించడమే 'ఇండియా' కూటమి లక్ష్యంగా ఉన్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు వినయ్ విశ్వం, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టంచేశారు. విజయవాడ దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలిసి వినయ్ విశ్వం మాట్లాడారు. వినయ్ విశ్వం మాట్లాడుతూ మణిపూర్ సంఘటన దేశాన్ని తలదించుకునేలా చేసిందని విమర్శించారు. కానీ మోదీ ఆ అంశంపై పార్లమెంట్‌లో వ్యంగ్యంగా మాట్లాడారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో ప్రధాని రెండు గంటలకుపైగా చేసిన ప్రసంగంలో అత్యంత ప్రాధాన్యత గల మణిపూర్ ఘర్షణలకు కేవలం నాలుగు నిమిషాలే కేటాయించడం అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా నడివీధుల్లో ఊరేగించినా కేంద్రహోంమంత్రి అమిత్‌షా, అధికారులు మౌనం వహించారని ఆరోపించారు. సెవెన్ సిస్టర్స్‌గా పిలిచే ఈశాన్య రాష్ట్రాల్లోని అటవీ, ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికి మోదీ సర్కారు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో యువతకు ఉపాధి అవకాశాలు బాగా తగ్గాయని చెప్పారు. న్యాయ చట్టాల్లో మార్పుచేసి కొత్త పేర్లు పెట్టడం ముఖ్యం కాదని, పేదలకు, వలస కార్మికులకు రక్షణ,

- మిగతా 2 లో

జనరిక్ మందులు రాయండి

- లేకపోతే లైసెన్సులు రద్దు
- వైద్యులకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ: రోగులకు జనరిక్ మందులనే సిఫార్సు చేయాలని, లేనిపక్షంలో లైసెన్సును సస్పెండ్ చేస్తామని వైద్యులకు కేంద్రప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఎన్‌ఎంసీఆర్‌ఎంపీ) పేరుతో జారీ చేసిన కొత్త నిబంధనల్లో స్పష్టంచేసింది. 2002లో భారత వైద్య మండలి (ఐఎంఎఫ్) జారీ చేసిన నిబంధనల ప్రకారం దేశంలోని ప్రతి వైద్యుడు జనరిక్ మందులనే రోగులకు సిఫార్సు చేయాలని సూచించినప్పటికీ అందుకు భిన్నంగా వ్యవహరించే డాక్టర్లపై ఎలాంటి చర్యలను తీసుకునే అంశం అందులో లేదు. ఇప్పుడు ఆ నిబంధనల స్థానంలో ఎన్‌ఎంసీఆర్‌ఎంపీ నియమావళి-2023 అమల్లోకి వచ్చింది. దీంతో నిబంధనలను అతిక్రమిస్తే లైసెన్సులు కోల్పోయే ప్రమాదం

- మిగతా 2 లో

ఇదీ లోకం!



దద్దరిల్లిన ఫ్యాప్టో ధర్నాలు

- జీవో 117తో విద్యావ్యవస్థ నాశనం: వెంకటేశ్వరరావు
- సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే: ఎస్టీయూ నేత తిమ్మన్న

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి... పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, విద్యావ్యవస్థను నాశనం చేసే జీవో 117ను రద్దు చేయాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో అధ్వర్యాన శనివారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ఉపాధ్యాయులు ధర్నాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అన్ని ఉపాధ్యాయ సంఘాలకు చెందిన సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగిన కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల బోధన విధానాన్ని అస్తవ్యస్తం చేస్తున్న జీవో నంబర్ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారని, సకాలంలో డీఏలు ఇవ్వటం, ఉపాధ్యాయుల నియామక ప్రక్రియలు చేపట్టడం జరగడం లేదని

- మిగతా 2 లో

పార్లమెంటు సమయం వృథా

- నిర్ణీత సమయం కంటే తక్కువ కార్యకలాపాలు
- అయితే అధిక బిల్లులకు ఆమోదం



న్యూఢిల్లీ : పార్లమెంటు సభా సమయం వృథా అయింది. నిర్ణీత సమయంకంటే తక్కువ కార్యకలాపాలు జరిగాయి. ఇటీవల ముగిసిన

- మిగతా 2 లో

చిరుత దాడిలో బాలిక మృతి

- తిరుమల నడక దారిలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి...
- లక్షిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

2 లో

తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే అలిపిరి నడక మార్గంలో చిరుత దాడి చేసిన ఘటనలో ఆరేళ్ల చిన్నారి మృతి చెందింది. కాలినడక మార్గంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో ఘటన జరిగినట్లు శనివారం ఉదయం గుర్తించారు.

నిరసనపై పోలీసు జులుం

ప్రాణాలు కోల్పోయిన ఫొటో జర్నలిస్ట్

అర్జెంటైనాలో భారీ నిరసన ప్రదర్శనలు

బ్యూనోస్ ఎయిర్స్: శాంతియుత నిరసనను అణచివేసే క్రమంలో ఆందోళనకారుడు ఫాసుండో మొలారేస్‌తో పోలీసులు కఠినంగా వ్యవహరించారు. రెండు చేతులు వెనక్కి విరిచి, తలను నేలకు ఆనించి, కాళ్లతో కొట్టారు. ఆయన ఇంకా కదలడం లేదని గ్రహించిన మరో నిరసనకారుడు విషయాన్ని అరిచి చెప్పడం, వీడియో తీయడంతో ఫాసుండోను వదిలిపెట్టారు. కానీ అప్పటికే ఆయన మరణించారు. ఇది అర్జెంటైనా ప్రజలకు కోపం తెప్పించింది. ఒబెలిస్క్ పరిసరాల్లో కనీసం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా జరుగుతున్న శాంతియుత నిరసనపై ఉక్కుపాదానికి ఇంత క్రూరంగా వ్యవహరించాల్సిన అవసరం ఏమిటని వారు ప్రశ్నించారు. బ్యూనోస్ ఎయిర్స్‌లో భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రాజకీయ, సామాజిక, కార్మిక సంఘాలకు చెందిన వందలాది మంది పాల్గొని ఫాసుండో మొలారేస్ మృతిని ఖండించారు. ఖాకీక్రౌర్యాన్ని వ్యతిరేకించారు. ఫొటో జర్నలిస్టు మరణాన్ని తీవ్రంగా పరిగణించారు. న్యాయం కోసం డిమాండ్ నిరసనకారులు చేశారు. 'పోరాటంలో ఇంకో ప్రాణం పోయేందుకు వీల్లేదు' అన్న బ్యానర్లను ప్రదర్శించారు. ఫార్క్ ఫొటో జర్నలిస్టు ఈ విధంగా చనిపోవడం బాధాకరమని రెబిలియన్ పాపులర్ సంఘం పేర్కొంది. గెరిల్లా యోధుడి నుంచి ఫొటో జర్నలిస్టు వరకు ఫాసుండో మొరాల్స్ షాకింగ్ కథ అంటూ ట్వీట్ చేసింది.

అప్రమత్తంగా ఉండండి

సైన్యానికి వెనిజులా అధ్యక్షుడి ఆదేశాలు

కారకస్: దక్షిణ అమెరికా దేశంలో శాంతి పరిరక్షణ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని బొలీవియన్ జాతీయ సాయుధ దళాలు (ఎఫ్ఏఎన్‌బీ)ను వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురో ఆదేశించారు. కారకస్‌లో సైనిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. మన గణతంత్ర సుస్థిరత, ప్రాదేశిక సమగ్రత, శాంతి పరిరక్షణ బాధ్యత మీపై ఉంది. ఇది మీ కర్తవ్యం కూడా' అని ఎఫ్ఏఎన్‌బీకి సూచనలు చేశారు. అమెరికా అండతో తమ దేశంపై దాడుల జరగవచ్చని తెలిపారు. పట్టణ హింసాత్మక ఆందోళనల కొత్త దశకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, సాయుధ గౌరింబాస్‌ను తిరిగి తేవాలని, హింస, అసహనం, ఘర్షణలను ప్రోత్సహించాలని, వెనిజులా ప్రజలను విభజించాలని ప్రయత్నాలు, ప్రణాళికలు జరుగుతున్నాయని మదురో హెచ్చరించారు. ఇటువంటివి జరగనివ్వబోమని సంకల్పించారు. అధ్యక్షుడి సూచనలకు ఎఫ్ఏఎన్‌బీ కమాండర్ డొమింగో హెర్నాండెజ్ సానుకూలంగా స్పందిస్తూ తమ మాతృభూమిని కాపాడుకుంటామని, దేశ సమగ్రతకు ముప్పు కలగనివ్వబోమని, ప్రజాస్వామిక వ్యవస్థలను పరిరక్షిస్తామని హామీనిచ్చారు. నిఘా పెంచి పూర్తి సన్నద్ధతతో వ్యవహరిస్తామని చెప్పారు. వెనిజులా సుమారు రెండు దశాబ్దాలుగా అమెరికా దాడులను ఎదుర్కొంటున్న విషయం విదితమే.

జనరిక్ మందులు రాయండి

(మొదటిపేజీ తరువాయి)

వైద్యులకు ఉంటుంది. ఈ మేరకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) వెల్లడించింది. అనవసర మందులు, అహేతుకమైన పరిమిత మోతాదుగల ట్యాబ్లెట్లను సూచించకూడదని నిబంధనల్లో పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే.. హెచ్చరికలు జారీ చేయడమే కాకుండా వర్క్‌షాపులకు హాజరయ్యేలా వైద్యులకు ఆదేశాలిస్తారు. పదే పదే నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్సును స్వల్పం కాలం పాటు సస్పెండ్ చేస్తారు. ఔషధాల పేర్లను క్యాపిటల్ అక్షరాల్లోనే వైద్యులు రాయాలని జాతీయ వైద్య కమిషన్ పేర్కొంది. బ్రాండెడ్ ఔషధాలతో పోలిస్తే జనరిక్ మందుల ధరలు 30 నుంచి 80శాతం తక్కువగానే ఉన్నాయి. వైద్యులు జనరిక్ మందులనే రాయడం వల్ల వైద్యఖర్చులు తగ్గడంతో పాటు అందరికీ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించినట్లవుతుంది' అని ఎన్ఎంసీ వెల్లడించింది.

మా జీతాలు పెంచాల్సిందే

బ్రిటన్‌లో జూనియర్ డాక్టర్ల డిమాండ్- సమ్మె

లండన్: దిగిరాని ద్రవ్యోల్బణానికి అనుగుణంగా తమ జీతాలు పెంచాలన్న డిమాండ్‌తో బ్రిటన్‌లోని జూనియర్ డాక్టర్లు మరోమారు సమ్మెబాట పట్టారు. నాలుగు రోజుల విధుల బహిష్కరణను ప్రకటించారు. జీతాల విషయంలో బ్రిటిష్ వైద్య మండలి (బీఎంఏ), ప్రభుత్వానికి మధ్య వివాదం నడుమ ఐదవ దశ పారిశ్రామిక చర్యకు జూనియన్ డాక్టర్లు పూనుకున్నారు. బ్రిటన్‌లో అధిక ద్రవ్యోల్బణం ఏడాదిగా సాగుతోంది. వినియోగ ధర సూచీ 12 నెలల్లో 7.9 శాతానికి చేరింది. దీంతో మెరుగైన వేతనాల కోసం వైద్యులు దశలవారీ సమ్మె కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఆరోగ్య వ్యవస్థపై ఒత్తిడి నేపథ్యంలో తాజా పరిణామాలతో ప్రభావం మరింతగా ఉండబోతోంది. 2008-09లో జూనియన్ వైద్యుల జీతాల్లో విధించిన కోతలను ఉపసంహరించి పూర్తిస్థాయి చెల్లింపులను పునరుద్ధరిలంచాలని కోరారు. జీవన వ్యయం, ద్రవ్యోల్బణం దృష్ట్యా భవిష్యత్‌లో ఎలాంటి కోతలు ఉండకూడా ప్రభుత్వం హామీనివ్వాలని వైద్యమండలి డిమాండ్ చేసింది. ఇదిలావుంటే, సెప్టెంబరులో చేపట్టే సమ్మె తేదీలను ఇంగ్లండ్‌లోని కన్సల్టెంట్‌లు ప్రకటించారు. జాతీయ ఆరోగ్య సేవలు (ఎన్‌హెచ్ఎస్)లో వరుస సమ్మెలు, బీఎంఏ చర్యలతో ఆరోగ్య రంగం స్తంభిస్తోందని బ్రిటన్ ఆరోగ్యశాఖ కార్యదర్శి స్టీవె బర్కలే పేర్కొన్నారు.

సెప్టెంబరుకల్లా ఉద్యోగులకు ఈహెచ్ఎస్

(మొదటిపేజీ తరువాయి)

నుండి వచ్చిన డిమాండ్లు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఆయన వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యంటీ కృష్ణబాబుతో సమీక్షించారు. మరో పది రోజుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమీక్షించనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఈ పథకం అమలుపై ఇటీవల ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వచ్చిన వివిధ ప్రతిపాదనలు, వాటి అమలు గురించి చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశంపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఉద్యోగ సంఘాలకు సంబంధించిన హౌసింగ్ సొసైటీల వారీగా ఇళ్ల స్థలాలకు ఎంత మేర భూమి అవసరమవుతుందో పరిశీలన జరపాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏజీ సాయి ప్రసాద్‌కు సూచించారు. దీనిపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పది రోజుల్లో ఉద్యోగుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారని సీఎస్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పబ్లిక్ హౌసింగ్ విధానాన్ని తీసుకువచ్చే అంశంపైనా దృష్టి సారించాలని సీఎస్ సూచించారు. యంటీ కృష్ణబాబు మాట్లాడుతూ ఈహెచ్ఎస్ అమలుకు సంబంధించి వివిధ ఉద్యోగ సంఘాల నుండి వచ్చిన ప్రతిపాదనల అమలుకు చర్యలు తీసుకున్నామని, మరికొన్ని ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఈహెచ్ఎస్ అమలుకు చర్యలు తీసుకున్నామని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకాన్ని మరో ఏడాదికి పొడిగించామని సీఎస్‌కు వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేస్తున్నామని, సెప్టెంబర్ నెలాఖరు నాటికి అందరికీ ఈహెచ్ఎస్ కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటామని కృష్ణబాబు చెప్పారు. సమావేశంలో ఆరోగ్య శ్రీ ఎగ్జిక్యూటివ్ అధికారి టీఎస్ఆర్ మూర్తి, వీడియో లింక్ ద్వారా ఆరోగ్యశ్రీ సీఈఓ హరీంద్ర ప్రసాద్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ఆర్.ముత్యాలరాజు, గృహ నిర్మాణ సంస్థ ఎండీ డా.లక్ష్మీషా, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ అలీమ్ భాషా, దివాన్ మైదీన్, జేడీ డేవిడ్ రాజు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అదనపు డైరెక్టర్ రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో బాలిక మృతి

విశాలాంధ్ర-తిరుమల :

తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే అలిపిరి నడక మార్గంలో చిరుత దాడి చేసిన ఘటనలో ఆరేళ్ల చిన్నారి మృతి చెందింది. కాలినడక మార్గంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో ఘటన జరిగినట్లు శనివారం ఉదయం గుర్తించారు. శుక్రవారం తప్పిపోయిన బాలిక లక్షిత నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెంకు చెందిన దినేష్ కుమార్, శశికళల కుమార్తెగా గుర్తించారు. రాత్రి 7.30-8 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల వెదుకులాట కారణంగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలికపై చిరుత దాడికి పాల్పడిన ఘటనా స్థలాన్ని సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్‌వో సతీష్ కుమార్ పరిశీలించారు. చిన్నారిపై దాడి చేసింది చిరుతా లేక ఎలుగు బంటా అన్నది పోస్టుమార్టం రిపోర్టు ద్వారా తెలుసుకుంటామన్నారు. దాడి చేసిన జంతువును బంధించేందుకు బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎలుగు బంటి అయితే మత్తు మందు ద్వారా బంధిస్తామని, చిరుత అయితే బోను ద్వారా బంధించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. జంతువుల కదలికలను గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాలు వినియోగిస్తామన్నారు. ఏడవ మైలు నుంచి నరసింహ స్వామి ఆలయం వరకు హైఅలర్ట్ జోన్‌గా ప్రకటిస్తున్నట్లు వివరించారు. ఈ సంఘటన తెలుసుకున్న వెంటనే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసిన టీటీడీ ఈఓ ఎ.వి.ధర్మారెడ్డి భక్తుల భద్రతకు సంబంధించి అనేక విషయాలపై టీటీడీ విజిలెన్స్, అటవీ శాఖ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఇక ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలను కూడా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు అనుమతించబోమని తెలిపారు.

భక్తుల భద్రత విషయంలో రాజీ ప్రసక్తే లేదు : టీటీడీ చైర్మన్ భూమన

తిరుమల నడక దారిలో శుక్రవారం రాత్రి చిరుత దాడికి గురై మరణించినట్లు భావిస్తున్న బాలిక లక్షిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ప్రకటించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు. టీటీడీ రూ.5 లక్షలు, అటవీ శాఖ రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షలు లక్షిత కుటుంబానికి అందజేస్తామన్నారు. అంతకుముందు చిన్నారిపై దాడి జరిగిన సంఘటనా స్థలాన్ని కరుణాకర్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భక్తుల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సంఘటనకు దారి తీసిన పరిస్థితులపై శనివారం సాయంత్రం అధికారులతో ఆయన మాట్లాడారు. అనంతరం క్రూరమృగం బాలికను ఎలా అడవిలోకి తీసుకుని వచ్చి ఉండవచ్చనే విషయాన్ని టీటీడీ, అటవీ, విజిలెన్స్ అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ జరిగిన సంఘటన బాధాకరమని, జూన్ 22న ఇలాంటి సంఘటనే జరిగిన నేపథ్యంలో భక్తుల భద్రత విషయంపై టీటీడీ ఇప్పటికే అనేక జాగ్రత చర్యలు తీసుకుందన్నారు. అటవీ, పోలీసు, టీటీడీ అధికారులు చర్చించి భద్రతాపరమైన ప్రతిపాదనలు చేస్తే టీటీడీ ఖర్చుతో ఏర్పాటు చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా సాంకేతికంగా కూడా ఎలా ఎదుర్కోవాలనే దిశగా ఆలోచన చేస్తామన్నారు. అటవీ సంరక్షణ చట్టాలు సమర్థవంతంగా అమలు జరుగుతున్నందువల్ల వన్య ప్రాణుల సంఖ్య కూడా పెరిగిందని, భక్తులు వీటిబారిన పడకుండా ఎలా రక్షణ కల్పించాలనేదే టీటీడీకి ముఖ్యమన్నారు. బాలిక కనిపించడం లేదన్న సమాచారం అందిన వెంటనే టీటీడీ అటవీ, పోలీసు, విజిలెన్స్, ప్రభుత్వ అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అడవిలో గాలింపు ప్రారంభించారని తెలిపారు. ఇందులో ఎవరి నిర్లక్ష్యం లేదని ఒక ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. చిన్న పిల్లలతో నడక మార్గంలో తిరుమలకు వచ్చే తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి పరిస్థితుల్లో కూడా పిల్లలను పక్కకు వదల వద్దని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. టీటీడీ డిప్యూటీ సీఎఫ్ శ్రీనివాస్, డీఎఫ్‌వో సతీష్, వీజీవో గిరిధర్, సీఐ జగన్మోహన్ రెడ్డి, ఇతర అధికారులు చైర్మన్ వెంట ఉన్నారు.

నడక మార్గాల్లో మరింత పటిష్ట భద్రత : టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి

తిరుమల నడక మార్గంలో చిన్నారిపై జరిగిన చిరుత దాడి ఘటన బాధాకరమని, అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మరింత పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం టీటీడీ, అటవీ, పోలీసు అధికారులతో ఈవో అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమల నడకమార్గంలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. నడక మార్గానికి రెండు వైపులా కంచె ఏర్పాటు చేసేందుకు సమగ్ర నివేదిక అందించాలని డీఎఫ్‌వోను ఆదేశించారు. చిరుత దాడి ఘటనపై సీసీఎఫ్ నాగేశ్వరరావు అధ్వర్యంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చెయ్యించి, చిరుతను బంధించడం కోసం బోను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నడక దారిలో ఇప్పటికే 30 మంది టీటీడీ భద్రతా సిబ్బంది, 10 మంది అటవీ శాఖ సిబ్బంది ఉన్నట్లు తెలిపారు. రెండు నడక మార్గాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. 100 మంది భక్తుల గుంపునకు భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసి అనుమతించనున్నట్లు ఆయన చెప్పారు. నడక దారులలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ట్రాంక్విలైజర్స్, బోన్లు వినియోగించి నడక మార్గాల్లో సంచరించే వన్య మృగాలను బంధించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఈ-2 జగదీశ్వర్ రెడ్డి, తిరుమల ఏఎస్ పి.మునిరామయ్య, డీఈ ఎలక్ట్రికల్ రవి శంకర్ రెడ్డి, డీఎఫ్‌వో శ్రీనివాసులు, వీజీవోలు బాల్ రెడ్డి, గిరిధర్, మనోహర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ఇండియా' లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండా బిల్లులు ఆమోదించుకున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సీపీఐ అధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న బస్సుయాత్ర పోస్టర్‌ను వినయ్ విశ్వం ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో మోదీని గద్దె దించటానికి ఇండియా కూటమి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతోందని ఓ ప్రశ్నకు సమాధానంగా వినయ్ విశ్వం చెప్పారు. పార్లమెంట్‌లో వైసీపీ ఎంపీల తీరును తాను గమనించానని, కాళ్లూ, చేతులు, బాడీ మాత్రం వైసీపీ వాళ్లదేగానీ... బుర్ర మాత్రం బీజేపీదిలా కనిపించిందని ఎద్దేవా చేశారు.

కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన రివర్స్‌లో నడుస్తున్నదని విమర్శించారు. కేవలం నాలుగు నెలల కాలంలో ఈ ప్రభుత్వం రూ.33,500 కోట్లు అప్పు చేసిందన్నారు. రాష్ట్రంలో పంటల విస్తరణ తగ్గిపోయిందని, నాలుగేళ్లలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును జగన్ సర్కారు పూర్తి చేయలేదని చెప్పారు. పోలవరాన్ని గాలికొదిలేసిందని మండిపడ్డారు. జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్మాణ పనులను చంద్రబాబు చేపట్టడమేమిటని గతంలో ప్రశ్నించిన జగన్...తాను అధికారంలోకి వచ్చిన తరువాత పోలవరాన్ని కేంద్రానికి ఎందుకు అప్పగించలేదని రామకృష్ణ నిలదీశారు. పోలవరాన్ని పూర్తి చేయటానికి 2020, 2021, 2022 ఖరీఫ్ సీజన్ నాటికి పోలవరం పూర్తి చేస్తామంటూ పదేపదే ప్రకటనలు చేసిన జగన్ ప్రభుత్వం...తాజాగా 2025కి పూర్తి చేస్తామని చెప్పటాన్ని తప్పుపట్టారు. 2024లో జగన్ ఇంటికెళ్లడం ఖాయమని రామకృష్ణ స్పష్టంచేశారు. వైసీపీ విధానాలతో రాష్ట్రానికి ఒక్క పెట్టుబడి రావటం లేదన్నారు. తైవాన్ కంపెనీ తమిళనాడుకు వెళ్లిందని, అమరరాజా విస్తరణ ప్లాంట్ తెలంగాణకు వెళ్లిందని, అనంతరపురంలోని జాకీ, కియా కంపెనీలు పెట్టుబడులు పెట్టడం లేదన్నారు. ఐటీ రంగంలో పురోగతి కనిపించడం లేదన్నారు. తెలంగాణలో రూ.2.20 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు జరగగా... ఏపీలో కనీసం రూ.2 వేల కోట్లు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో 35 శాతం పట్టభద్రులైన యువత నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువయ్యాయన్నారు.

రాష్ట్రంలో అన్నింటిపై పన్నుల భారం మోపారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుపై దాడి చేయటమే కాకుండా హత్యాయత్నం కేసు నమోదు చేయటం దుర్మార్గమని రామకృష్ణ వ్యాఖ్యానించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ఆగస్టు 17 నుంచి బస్సుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ యాత్ర విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్ వద్ద నుంచి ప్రారంభమై సెప్టెంబరు 8వ తేదీన తిరుపతిలో జరిగే భారీ బహిరంగ సభతో ముగుస్తుందని వివరించారు.

వైసీపీ నాయకులను ఉద్దేశించి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ పవన్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని రామకృష్ణ హితవు పలికారు. వైసీపీకి కేంద్రం అండదండలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. అందువల్లే వేల కోట్ల అప్పులు చేయగలుగుతున్నదని, జగన్‌పై ఉన్న కేసులు ముందుకు సాగటం లేదని పేర్కొన్నారు. ఎన్‌డీఏకి బయట ఉన్న ఏ రాజకీయ పార్టీ వైసీపీలా దిగజారి బీజేపీకి మద్దతు ఇవ్వలేదన్నారు.

దద్దరిల్లిన ఫ్యాప్టో ధర్నాలు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన విమర్శించారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించే విషయంలో ప్రజాస్వామ్య దృక్పథం కనిపించడం లేదని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో చిత్తశుద్ధి కానరావడం లేదని ఆయన మండిపడ్డారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి హెచ్. తిమ్మన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14వేల పాఠశాలలు సింగిల్ టీచర్‌తో నడుస్తుండగా, ప్రభుత్వం ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా...ఉన్న పోస్టులను రద్దు చేసే చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. ఉపాధ్యాయులపై ఉక్కుపాదం మోపుతూ వేధించడం నిత్యకృత్యంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగు కాకముందే ఈ వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందని, ఇందుకోసం ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను వేధించడం తగదని, ప్రభుత్వ వైఫల్యాలను ఉపాధ్యాయుల మీదకు నెట్టడం సమంజసం కాదన్నారు. శ్రీకాకుళంలో పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేయడం, ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు స్వస్తి పలకాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే తాత్కాలిక సాయం ప్రకటించాలని కోరారు. విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన ఆందోళనా కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎన్జీవో రాష్ట్ర నాయకులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పోరాడకతప్పదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జరిగే ఉద్యమాలకు ఎన్జీవోల మద్దతు ఉంటుందన్నారు. ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు పి.పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ 117 జీవో వచ్చి సంవత్సరం కాలం గడిచిందని, జీవో విడుదలైనప్పుడే ఉపాధ్యాయ సంఘాలన్నీ సంఘటితమై ఎదుర్కొని ఉంటే ఈ జీవో అమలయ్యేది కాదన్నారు. జీవో అమలు వల్ల సమీప భవిష్యత్తులో ప్రాథమిక పాఠశాలలు, ఆ తర్వాత ఉన్నత పాఠశాలలు ప్రభుత్వ రంగం నుంచి అదృశ్యమయ్యే ప్రమాదం కనపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను ఇంతగా వేధిస్తున్న ప్రభుత్వాన్ని ఇంతకుముందు ఎన్నడూ చూడలేదన్నారు. దీనికి పాలకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ సయ్యద్ ఖాసిం, ఇమామ్ బాషా, ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి భిక్షమయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అరుణ, ఓపీడీఆర్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.హనుమంతరావు, జనసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఢిల్లీ బిల్లు'కు రాష్ట్రపతి ఓకే

(మొదటిపేజీ తరువాయి)

బిల్లును విపక్ష కూటమి 'ఇండియా' తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రతిపక్షాల నిరసనల మధ్య తొలుత లోక్‌సభ, ఆ తర్వాత రాజ్యసభ బిల్లుకు ఆమోదం తెలిపాయి. తాజాగా రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారింది.

ఢిల్లీ సర్వీసుల బిల్లుతో పాటు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, జనన, మరణాల నమోదు (సవరణ) బిల్లు, జన్ విశ్వాస్ (సవరణ) బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. దీంతో ఇవి కూడా చట్టంగా మారాయి. దేశ పౌరుల డిజిటల్ హక్కులను బలోపేతం చేయడంతో పాటు వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి పాల్పడే కంపెనీలపై కొరడా ఝుళిపించేందుకు డేటా ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకొచ్చారు. దీని ప్రకారం ఇకపై డిజిటల్ యూజర్ల డేటా గోప్యతను కాపాడలేకపోయినా, సమాచార దుర్వినియోగానికి పాల్పడినా ఆ కంపెనీలపై కనిష్ఠంగా రూ.50 కోట్ల నుంచి గరిష్ఠంగా రూ.250 కోట్ల వరకు జరిమానా విధించాలనే నిబంధన తీసుకొచ్చారు.

పార్లమెంటు సమయం వృథా

(మొదటిపేజీ తరువాయి)

వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ నిర్ణీత సమయంలో 43 శాతం మాత్రమే పని చేయగా, రాజ్యసభ 55 శాతం మాత్రమే పని చేసింది. అయితే 23 బిల్లులు ఆమోదించబడటంతో సభా కార్యకలాపాలు ఎక్కువగానే ఉన్నాయని ఒక మేథోమథన సంస్థ సంకలనం చేసిన సమాచారం పేర్కొంది. లోక్‌సభ 17 సమావేశాలను కలిగి ఉంది. ఇది దాదాపు 44 గంటల 15 నిమిషాల పాటు కొనసాగింది. అవిశ్వాస తీర్మానంపై 19 గంటల 59 నిమిషాల పాటు చర్చ జరగగా, 60 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. మూజువాణి ఓటు ద్వారా తీర్మానం నెగ్గిందని పీఎస్ఆర్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సంకలనం చేసిన సమాచారం వెల్లడించింది. ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంత పాలన (సవరణ) బిల్లు, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, అటవీ (పరిరక్షణ) సవరణ బిల్లు, గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు వంటి ఇతరత్రా 23 బిల్లులు ఈ సమావేశాల్లో ఆమోదం పొందాయి. చాలా బిల్లులు స్వల్ప పరిశీలనతో ఆమోదించారు. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బిల్లుల్లో దాదాపు 56 శాతం ఉభయ సభలు ఆమోదించాయి. సగటున సభల్లో ప్రవేశపెట్టిన బిల్లు ఎనిమిది రోజులలో ఆమోదం పొందాయి. 'ఉదాహరణకు, ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ విచక్షణ అధికారాలను విస్తరించే బిల్లులు, లిథియం వంటి వ్యూహాత్మక ఖనిజాల తవ్వకాలను అనుమతించడం, వ్యక్తిగత డేటాను నియంత్రించడం వంటివి ప్రవేశపెట్టిన ఏడు రోజుల్లోనే పార్లమెంటు ఆమోదించింది. అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లు-2023 ఐదు రోజుల్లోపే ఆమోదం పీఆర్ఎస్ పేర్కొంది. ప్రవేశపెట్టిన బిల్లుల్లో మూడింటిని కమిటీలకు సిఫార్సు చేశారు. ఈ లోక్‌సభలో 17 శాతం బిల్లులను కమిటీలకు పంపారు. గత మూడు లోక్‌సభలతో పోలిస్తే ఇది తక్కువ. ఈ సమావేశాల్లో ఆమోదించిన 23 బిల్లులలో ఏడింటిని స్టాండింగ్ కమిటీలు పరిశీలించాయని పీఆర్ఎస్ తెలిపింది. బిల్లుల్లో ఢిల్లీ సేవల బిల్లుపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఇది లోక్‌సభలో సుమారు నాలుగు గంటల 54 నిమిషాలు, రాజ్యసభలో దాదాపు ఎనిమిది గంటల పాటు చర్చకు వచ్చింది. ఆ తర్వాత డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లుపై లోక్‌సభలో 56 నిమిషాలు, అలాగే, రాజ్యసభలో గంటకు పైగా చర్చించారు. అటవీ సంరక్షణ (సవరణ) బిల్లుపై లోక్‌సభలో 38 నిమిషాలు, రాజ్యసభలో గంట 41 నిమిషాలు చర్చ జరిగింది.

జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు లోక్‌సభలో 23 నిమిషాలు, రాజ్యసభలో 35 నిమిషాలు, గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లుపై దిగువ సభలో 19 నిమిషాల పాటు, ఎగువ సభలో గంట 34 నిమిషాలు చర్చ జరిగింది. ఇక ఐఐఎం (సవరణ) బిల్లు-2023, ఇంటర్-సర్వీసెస్ ఆర్గనైజేషన్ బిల్లు 2023 సహా తొమ్మిది బిల్లులు లోక్‌సభలో 20 నిమిషాల వ్యవధిలో ఆమోదం పొందాయి. నేషనల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కమిషన్, నేషనల్ డెంటల్ కమిషన్‌ను రూపొందించే బిల్లులను మూడు నిమిషాల్లో లోక్‌సభలో చర్చించి ఆమోదించారు. సీజీఎస్టీ, ఐజీఎస్టీ సవరణ బిల్లులు లోక్‌సభలో రెండు నిమిషాల్లోనే ఆమోదం పొందాయి. వరుసగా మూడు రోజుల్లో 10 బిల్లులను రాజ్యసభ ఆమోదించింది.

ఎదురు కాల్పులతో విలవిల

ఘర్షణలు ఆపాలని కుకీ, మైతేయిలకు ముస్లింల విజ్ఞప్తి



క్వాక్తా: మణిపూర్‌లో జాతి హింస చెలరేగి 100 రోజులు దాటింది. రాష్ట్రం నెమ్మదిగా సాధారణ స్థితికి చేరుకుంటోంది. కొన్ని రోజులుగా పెద్ద సంఘటనలు లేవు. అయితే ఘర్షణలకు కేంద్రబిందువుగా కుకీ ప్రాబల్య ప్రాంతమైన చురాచంద్‌పూర్ జిల్లా, మైతేయిలు అధికంగా ఉన్న బిష్ణుపూర్ జిల్లా మధ్య ప్రాంతంలో నిరంతర కాల్పులు, బాంబు దాడులు సాధారణంగా మారాయి. ఈ రెండు జిల్లాల మధ్య 35 కి.మీ దూరంలో ఉన్న భూభాగంలో కుకీ, మైతేయి తెగల మధ్య జరిగిన ఘోరమైన ఎదురుకాల్పుల్లో కొందరు మైతేయి పంగల్లు లేదా ముస్లింలు చిక్కుకుపోయి విలవిలాడుతున్నారు. మణిపూర్‌లోని 32 లక్షల జనాభాలో ముస్లింలు 9 శాతం ఉన్నారు. కుకీలు, మైతేయిల మధ్య పోరు కొనసాగుతున్నందున ముస్లిం సమాజానికి చెందిన ప్రజలు రెండు పక్షాల మధ్య హింసలో చిక్కుకొని శాంతి కోసం పిలుపునిచ్చారు. ఒక ఆంగ్ల వార్తా సంస్థ బిష్ణుపూర్ జిల్లాలోని క్వాక్తా గ్రామానికి వెళ్లినప్పుడు కుకీ ఆధిపత్య ప్రాంతం చురాచంద్‌పూర్‌కి ఆవల ఉన్నందున ముందు వరుసను సమర్థవంతంగా గుర్తించడం ద్వారా పోలీసులు రోడ్లపై బారికేడ్‌లు పెట్టారు. ఆగస్టు 6న బిష్ణుపూర్ జిల్లాలోని వారి గ్రామంలో నిద్రిస్తున్న తండ్రి, అతని కొడుకు సహా ముగ్గురిని కాల్చి చంపారు. చురాచంద్‌పూర్‌కు చెందిన దుండగులు రాత్రి గ్రామంలోకి చొరబడి కుటుంబంపై దాడి చేశారని మైతేయిలు ఆరోపించారు. 'ఈ పరిస్థితి కారణంగా క్వాక్తాలోని రెండు మసీదులను భద్రతా దళాలు కొన్ని గంటల పాటు ఉపయోగించాయి. కాల్పులు జరిగాయి. కానీ మేము మా పరిస్థితిని వారికి వివరించాము. ఆ తర్వాత వారు వెళ్లిపోయారు' అని జమియత్ ఉలమా-ఇ-హింద్‌కు చెందిన సలావుద్దీన్ ఖాసిమీ ఆ వార్తా సంస్థకు తెలిపారు. క్వాక్తా ఒక బహుళజాతి ప్రాంతం, ఇక్కడ ఒకప్పుడు మైతేయిలు, కుకీలు ఇరుగు పొరుగుగా నివసించారు. అయితే, పట్టణ జనాభాలో ముస్లింలు 90 శాతం ఉన్నారు. సంఘర్షణలో పాలుపంచుకోకపోయినా మణిపూర్ ముస్లింలు నిస్సహాయంగా మైతేయి, కుకీల మధ్య ఎదురుకాల్పుల్లో చిక్కుకున్నారు. క్వాక్తాలో వారి జీవనోపాధి ఛిద్రమైంది. 'క్వాక్తాలో ప్రజలు భయాందోళనలతో జీవిస్తున్నారు. ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. జీవనోపాధి లేకపోవడం, జీవితం అథమస్థాయిలో పడిపోయింది. భారీ సంఖ్యలో బాంబు పేలుళ్ల కారణంగా పాఠశాలలు మూతపడటంతో విద్యార్థులు చదువుకోలేకపోతున్నారు' అని ముస్లిం పండితుడు నాసిర్ ఖాన్ చెప్పారు. పోరాటాన్ని ఆపమని కుకీ, మైతేయిలకు ముస్లింలు విజ్ఞప్తి చేశారు. 'మేము మైతేయి పంగల్లు మైనారిటీ వర్గం. నేపాలీలు, ఇతరుల మాదిరిగానే మేము తీవ్రంగా దెబ్బతిన్నాము. జీవనం అస్తవ్యస్తమైంది. శాంతిని తిరిగి తీసుకురావాలని మేము మా మైతేయి, కుకీ సోదరులు, సోదరీమణులకు విజ్ఞప్తి చేస్తున్నాము' అని స్థానిక ముస్లిం నాయకుడు హాజీ రఫత్ అలీ చెప్పారు. తమ ప్రాంతాల్లో మరింత భద్రత కల్పించాలని కేంద్రాన్ని కోరేందుకు మణిపూర్‌కు చెందిన ముస్లిం నేతలు ఢిల్లీకి వచ్చారు. కుకీ ప్రాబల్యం కలిగిన చురాచంద్‌పూర్ జిల్లాతో బిష్ణుపూర్ జిల్లా సరిహద్దులో ఉన్న మైతేయి ఆధిపత్య ప్రాంతంలో ఉన్న క్వాక్తా పట్టణం కూడా మూడు నెలలుగా ఘర్షణ సందర్భంగా చోటుచేసుకుంటున్న ఎదురు కాల్పుల్లో చిక్కుకుంది.

హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్‌గా బొత్స ఝాన్సీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం బార్ కౌన్సిల్ సభ్యురాలిగా డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మీ నమోదు చేసుకున్నారు. విజయనగరం జిల్లాకు చెందిన బొత్స ఝాన్సీ గతంలో ఎంపీగా పనిచేశారు. ఈమె విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి. ఈ సందర్భంగా ఝాన్సీకి ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ అభినందనలు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకిచ్చిన హామీ నెరవేర్చాలి

తిరుపతిరావు డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు: అగ్రిగోల్డ్ బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండు చేశారు. 14న ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా కమిటీ అధ్వర్యంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లించి, న్యాయం చేయాలని కోరుతూ తొమ్మిదేళ్లుగా పోరాడి... బాధితులకు రూ.906 కోట్లు ఇప్పించినట్లు తెలిపారు. 11 లక్షల మందికి ఇంకా రూ.3,080 కోట్ల బకాయిలు రావాల్సి ఉందన్నారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి అందరికీ వడ్డీతో సహా చెల్లిస్తామని, సంస్థ, న్యాయస్థానం విషయం ప్రభుత్వం చూసుకుంటుందని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికే అగ్రిగోల్డ్ బాధితులు సుమారు 600 మంది ఆత్మహత్యలు, అసహజ మరణాలకు గురయ్యారని, గత ప్రభుత్వం 142 మందికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించిందన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల న్యాయమైన పోరాటానికి మద్దతుగా ఈనెల 14న ఒంగోలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అగ్రిగోల్డ్ బాధితులు భారీగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, అగ్రిగోల్డ్ బాధితులు, ప్రజలు విరివిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సీహెచ్. వాసు, టి.వెంకట కామేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, సీహెచ్ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన టమాటా ధర

- ప్రస్తుతం కిలో రూ.30 నుంచి 50
- ఊపిరి పీల్చుకుంటున్న మధ్యతరగతి ప్రజలు

విశాలాంధ్ర-పులివెందుల: టమాటా ధరలు కొండ దిగాయి. ధరలు కూడా అదుపులోకి వస్తుండటంతో సామాన్యులు, పేదల ఊపిరి పీల్చుకుంటున్నారు. నిన్నా మొన్నటి వరకు సామాన్యుడికి అందనంత ఎత్తులో నిలిచిన టమాటా ధరలు ఇప్పుడిప్పుడే భారీగా తగ్గు ముఖం పడుతున్నాయి. మూడు వారాల క్రితం టమాటా ధర కిలో రూ.150లు నుంచి రూ.200ల వరకు పలికాయి. ప్రస్తుతం మార్కెట్‌లో టమాటా నాణ్యత బట్టి కిలో రూ.30ల నుంచి రూ.50ల వరకు క్రయ, విక్రయాలు సాగుతున్నాయి. ఒకప్పుడు టమాటాలు గిట్టుబాటు కాక కొంత మంది రైతులు పంటను మూగజీవాలకు ఆహారంగా వేసేయడం, మరికొంత మంది రైతులు రోడ్లపైనే పారబోయటం లాంటి సంఘటనలు కోకొల్లలు. టమాటా ధరలు భారీగా పెరగటంతో కొంత మంది టమాటాలకు ప్రత్యామ్నాంగా చింతపండు వినియోగించారు. టమాటా కొరతపై ప్రభుత్వం కూడా స్పందించింది. ఇందుకు ప్రత్యామ్నాయంగా మదనపల్లె నుంచి పులివెందులకు టమాటాలు రప్పించి కిలో రూ.50ల చొప్పున విక్రయించారు. ఆధార్ కార్డుకు కిలో చొప్పున టమాటాలు విక్రయించారు. ఎన్నడూ లేని విధంగా టమాటా ధరలు నింగిని తాకడం ప్రభుత్వాలను కలవరపాటుకు గురిచేశాయి. ఈ ఏడాది విపరీతమైన ఎండలు, ఉష్ణోగ్రతలు ఉండటంతో టమాటా పంటకు అనుకూలించలేదు. టమాటా మొలకదశలోనే పైరు దెబ్బతినింది. మరికొన్ని చోట్ల టమాటా నిట్టనిలువునా ఎండిపోయింది. దీంతో టమాటా కనివినీ ఎరుగని రీతిలో కొరత ఏర్పడింది. అయితే కష్టాలకు ఓర్చుకుని సాగు చేసిన రైతుకు పంట పండింది. కాసులు కురిపించాయి. ఏదో విధంగా టమాటా రైతుకు కాలం కలిసి రావడంతో గట్టెక్కారు. సాధారణంగా పంట ఉంటే ధర ఉండదు, ధర ఉంటే పంట ఉండదు. చాలా కాలం నుంచి ఈ పరిస్థితి నెలకొంది. నెల క్రితం సాగు చేసిన టమాటా పంట ఇప్పుడిప్పుడే రైతుకు ఆదాయం ఇస్తుంది. ముమ్మందు వర్షాలు సమృద్ధిగా వస్తే టమాటా అధిక విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉంది. బహుశా సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు పంట ఉంటుంది. ఇప్పుడిప్పుడే ధరలు అదుపులోకి రావడంతో సామాన్యులకు ఊరట లభిస్తుంది. ముమ్మందు టమాటా ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే...

బస్సుయాత్ర జయప్రదానికి డేగ ప్రభాకరరావు, తాటిపాక మధు పిలుపు

విశాలాంధ్ర-కాకినాడ: కేంద్ర, రాష్ట్ర పాలకుల వైఫల్యాలను ఎండగట్టేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టే బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకరరావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. శనివారం కాకినాడలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో టి.అన్నవరం అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథులుగా డేగ ప్రభాకరరావు, తాటిపాక మధు పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వంత పాడుతోందని విమర్శించారు. బీజేపీ అజెండాను అనుసరిస్తోందని, రాష్ట్ర ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందన్నారు. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల దుష్టపాలనపై ప్రజలకు తెలియజేస్తామని, ప్రజా వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించేందుకు బస్సు యాత్రను సీపీఐ చేపట్టనుందని, దీనిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల తరపు నిరంతరం పోరాడే ఏకైక పార్టీ సీపీఐ ఒక్కటేనని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సీపీఐ సిద్ధంగా ఉంటుందన్నారు. బస్సుయాత్ర ఈనెల 21న కాకినాడ జిల్లాకు చేరుతుందని, ప్రజా సంఘాలు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పెద్ది రెడ్ల సత్యనారాయణ, పీఎస్ నారాయణ పాల్గొన్నారు.

వలంటీర్లు... దండుపాళ్యం బ్యాచ్

పవన్ తీవ్ర విమర్శ

విశాలాంధ్ర-పెందుర్తి: నేరగాళ్లను విచ్చలవిడిగా వదిలేసి...ప్రజల కోసం పనిచేస్తున్న తమపై ఆంక్షలు, కేసులు పెట్టడం ఈ ప్రభుత్వానికి అలవాటైపోయిందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆరోపించారు. విశాఖ నగర పరిధిలోని పెందుర్తి, సుజాతనగర్‌లో ఇటీవల వలంటీర్ చేతిలో హత్యకు గురైన కోటగిరి వరలక్ష్మి కుటుంబాన్ని పవన్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో ఈ పరామర్శలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో పవన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తమ నవరత్నాల కోసం నియమించిన వలంటీర్ వ్యవస్థ ప్రజల ప్రాణాలు తీస్తోందని, కొంతమంది వలంటీర్లు అసాంఘిక శక్తులుగా మారి నేరాలకు తెగబడుతున్నారన్నారు. వాళ్లు చేస్తున్న దురాగతాలు కొన్ని మాత్రమే బయటకు వస్తున్నాయని, బయటకు రాని నేరాలు చాలానే ఉన్నాయన్నారు. వలంటీర్ల ముసుగులో కొందరు చేస్తున్న దురాగతాలు రోజుకొకటి వెలుగు చూస్తున్నాయని, వారిపై పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో రెచ్చిపోతున్నారని, ఇదొక దండుపాళ్యం బ్యాచ్‌లా తయారైందన్నారు. వలంటీర్ చేతిలో హతమైన వరలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించడానికి ప్రభుత్వం తరపున ఒక్క వైసీపీ నాయకుడు కూడా రాలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వలంటీర్లతో సమాంతర వ్యవస్థ నడుపుతోందని, అది శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నదని, నవరత్నాల కోసం నియమిస్తే ప్రజల ప్రాణాలు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంక్షలు పవన్ కల్యాణ్ కేనా...అలాంటి వారికి లేవా అని పవన్ ప్రశ్నించారు. మహిళల అక్రమ రవాణా విశాఖ నుంచే ఎక్కువుగా జరుగుతోందన్నారు. ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు పోలీసుల చేతులు కట్టేస్తున్నారని విమర్శించారు. వలంటీర్ చేసిన ఈ దురాగతాన్ని బయటపెట్టిన పోలీసులకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచ పోటీతత్వంతో విద్యార్థులకు బోధన

పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యార్థులను ప్రపంచ పోటీతత్వంతో తీర్చిదిద్దాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉందని పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. అందుకు గాను ప్రభుత్వం 60 వేల పాఠశాలలకు ఐబీ/కేంబ్రిడ్జ్ బోర్డుతో 10, 12వ బోర్డు స్థాయిలో భాగస్వామ్యాన్ని, దాని పాఠ్యాంశాలు, బోధనా పద్ధతి, మూల్యాంకన పద్ధతిని పునరుద్ధరణకు సిద్ధమైందని ఆయన తెలిపారు. దీని వలన విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్, సమస్య పరిష్కారం, ఆలోచనాత్మక ధోరణలు మెరుగుపడతాయన్నారు. ఈ నేపథ్యంలో 14న విజయవాడ, గుంటూరులోని కొన్ని ఎంపిక చేసిన ఐబీ, కేంబ్రిడ్జ్ పాఠశాలలను సందర్శిస్తానన్నారు.

ప్రధానోపాధ్యాయుల్లో వృత్తి నైపుణ్యం పెంపే లక్ష్యం

సిమాట్ డైరెక్టర్ మస్తానయ్య

విశాలాంధ్ర-రామచంద్రాపురం : ప్రభుత్వ ప్రధానోపాధ్యాయు లలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యమని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (సిమాట్) డైరెక్టర్ మస్తానయ్య తెలిపారు. శనివారం మండలంలోని రామాపురం సమీ పంలో గల వెరిటాస్ సైనిక్ స్కూల్లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్ర మాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ 44,480 స్కూళ్లలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులకు మూడు సంవత్సరాలలో నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మొదటి బ్యాచ్‌లో విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, బాపట్ల, తిరుపతి, అనంతపురం శిక్షణ కేంద్రాలలో 1,450 మంది ప్రధానోపాధ్యాయులు శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యా యులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యా యులలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులుగా శారద, సాయి కృష్ణ, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఆనంద్ రెడ్డి, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్, అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వి.మధు, మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మోదీ, జగన్‌ను సాగనంపాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ

విశాలాంధ్ర-ఏలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, మోదీ, జగన్ ప్రభుత్వాలను గద్దెదించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. దేశాన్ని రక్షించండి నినాదాంతో ఈనెల 17న విశాఖలో ప్రారంభమయ్యే సీపీఐ బస్సు యాత్ర జయప్రదానికి పిలుపునిచ్చారు. శనివారం ఏలూరులోని సీపీఐ కార్యాలయం స్ఫూర్తిభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వనజ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను మోదీ సర్కార్ నిర్వీర్యం చేస్తోందన్నారు. గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను అదానీకి అమ్మడం ద్వారా విశాఖ ఉక్కు ముడి ఖనిజం రవాణా కాకుండా అడ్డుకొని విశాఖ ఉక్కు పరిశ్రమకు నష్టాలు చూపిస్తూ దానిని ప్రైవేటుకు అప్పగిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేకప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ వంటి విభజన హామీలను అటకెక్కించిందని, ముఖ్యమంత్రి జగన్ కేంద్రాన్ని నిలదీయలేని అసమర్థుడని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోందని దుయ్యబట్టారు. దళితులు, మైనారిటీలు, ప్రతిపక్షాలపై దాడులు పెరిగాయన్నారు. మోదీ, జగన్‌ను సాగనంపాలని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ బస్సుయాత్ర ఈనెల 23న ఏలూరు జిల్లాలో ప్రవేశిస్తుందని, జంగారెడ్డిగూడెంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. 24న ఏలూరులో రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని రాజకీయ పక్షాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో అక్కినేని వనజ పాల్గొన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, జమ్మి శ్రీనివాసరావు, కంచర్ల గురవయ్య, కొండేటి బేబి పాల్గొన్నారు.

మౌనంతో గాయాలు మానవు

ప్రకాశ్‌రాజ్

హైదరాబాద్: లౌకిక, ప్రజాస్వామిక విలువల కోసం రచయితలందరూ సంఘటితమైనదే సమూహమని, ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా రచయితలు అందరి ఉమ్మడి స్వరమే సమూహ అని, సహనశీలతను పాటిస్తూ మతోన్మాదాన్ని ధిక్కరించే సాహిత్యకారులు, సాంస్కృతిక కార్యకర్తల ఉమ్మడి వేదిక సమూహ అని సినీనటుడు, రచయిత, సామాజిక కార్యకర్త ప్రకాశ్‌రాజ్ అన్నారు. హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆవిర్భావ సభ శనివారం జరిగింది. ఈ సభను ప్రకాశ్‌రాజ్ ప్రారంభించారు. సమూహ లోగోను ఆవిష్కరించారు. అనేక మంది కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. 'కేవలం ప్రతిభ ఉంటేనే రచయిత, కవి, కళాకారుడు కాలేరు. సమాజ పరిస్థితులపై స్పందించగలిగితేనే రాణించగలుగుతారు. శరీరానికి తగిలిన గాయాలు మౌనంగా ఉంటే తగ్గుతాయి.. కానీ దేశానికి తగిలిన గాయాలు మౌనంగా ఉంటే తగ్గలేవు. ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లో ఉన్నాం. సమాజంలో జరుగుతున్న పరిణామాలు చూస్తూ ఊరికే కూర్చోలేను. 100 రోజుల నుండి మణిపూర్ రగిలిపోతుంటే పార్లమెంట్‌లో నువ్వా నేనా అన్నటు నడిచారు. రాజకీయం తప్ప సమస్య మీద స్పందన లేదు. 10 రోజుల పార్లమెంట్ సమావేశాల్లో రాజకీయం తప్ప ప్రజల సమస్యలపై చర్చించలేదని ప్రకాశ్‌రాజ్ అన్నారు. జోకర్‌ని నాయకుడు చేస్తే మనం చూసేది సర్కస్ మాత్రమేనని, మనలో ఐక్యత లేదని, మొదట మనలో మార్పు రావాలని ఆకాంక్షించారు. 70ఏళ్ల తర్వాత మనం మారామని, ఎక్కడ తప్పు జరిగిందని చూసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మొదటిసారి ఇలాంటి స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం బాధగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సమాజం సందిగ్ధతలో ఉందని అన్నారు. వంద రోజులుగా మణిపూర్ మండిపోతుండటంపై ప్రశ్నిస్తే హరియాణా, బెంగాల్ అని అనవసర విషయాలు ప్రస్తావించారని, గొప్పగా చెప్పుకోవడానికి ఏమీ లేదని, దేశంలో మతోన్మాదం పేట్రేగిపోతోందని ప్రకాశ్‌రాజ్ విమర్శించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

జీతాలు, మెస్ చార్జీలు పెంచాలి

లేకపోతే చలో విజయవాడ
రమేశ్‌బాబు, నాగసుబ్బారెడ్డి

విశాలాంధ్ర-కడప బ్యూరో: జగన్నన్న గోరుముద్ద నూతన మెనూ అమలు చేయాలనే ఒత్తిడితో మహిళా కార్మికుల ఇబ్బందులు పెరిగాయని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేశ్ బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి అన్నారు. మహిళా కార్మికుల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. తక్షణమే వేతనాలు, మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వంట ఆపేసి చలో విజయవాడకు పిలుపునిస్తామని ప్రభుత్వానికి నాయకులు హెచ్చరించారు. శనివారం కడప జిల్లా, రాయచోటిలో అన్నమయ్య జిల్లా స్థాయి మిడ్డే మీల్ కార్మికుల సర్వసభ్య సమావేశం నాగరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న రమేశ్‌బాబు, నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ 'ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యవసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. మెస్‌చార్జీలు పెంచకపోతే గోరుముద్ద పథకాన్ని మహిళా కార్మికులు ఎలా కొనసాగిస్తారు?' అని ప్రశ్నించారు. జగనన్న గోరుముద్ద పథకం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారిందని విమర్శించారు. రాష్ట్ర అధికారులు కనీస అవగాహన లేకుండా ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారని, ఈ పథకంపై పునరాలోచన చేసి ప్రతి విద్యార్థికి మెస్‌చార్జీని రూ.30 చొప్పున పెంచాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. కార్మికులకు రూ.10వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మౌలిక వసతులతో పాటు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పింఛన్ వసతులు కల్పించాలని, హెల్త్ కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చి స్కూల్ కమిటీ చైర్మన్‌ల రాజకీయ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తామని నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాంద్‌బాషా, నాగరాణి, ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్లు సలీం, వేణు గోపాల్ రెడ్డి, నరసింహులు, ముజఫర్, కృష్ణవేణి, ఈశ్వరయ్య, అలివేలమ్మ, రామచంద్ర పాల్గొన్నారు.

బీజేపీకి జగన్ ప్రభుత్వం ఊడిగం

పరుచూరి రాజేంద్ర బాబు విమర్శ

విశాలాంధ్ర-చింతలపూడి: ఆంధ్రప్రదేశ్‌లోని జగన్ ప్రభుత్వం బీజేపీకి ఊడిగం చేస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు విమర్శించారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని వ్యాఖ్యానించారు. శనివారం ఏలూరు జిల్లా, సీపీఐ చింతలపూడి పట్టణ కార్యాలయంలో ఏఐవైఎఫ్ గోదావరి జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాజేంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసే పార్టీ సీపీఐ అని, సంక్షేమ పథకాలకు వ్యతిరేకం కాదని స్పష్టంచేశారు. ప్రజలకు ఇచ్చే ప్రతి రూపాయి ప్రజా ధనమేనని చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే నినాదంతో ఈనెల 17 నుంచి తలపెట్టే సీపీఐ బస్సు యాత్రలో యువత భారీగా పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా కన్వీనర్, కో-కన్వీనర్ తోర్లపాటి రాజు, సురేశ్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పేయ్యాల పృథ్వీరాజ్, నాయకులు లంకేసాయి, శ్రీనివాస్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

గృహసారధులు, సచివాలయ, మండల కన్వీనర్లకు బీమా

వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లకు బీమా కల్పించనున్నామని, దానికి సంబంధించిన సమాచారం కోరామని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్ ఛార్జులు, పరిశీలకులు, జేసీఎస్ కో-ఆర్డినేటర్లతో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సజ్జల మాట్లాడుతూ పార్టీ కోసం అంకిత భావంతో పని చేసేవారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి ఆరోగ్య భద్రత, పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామని అన్నారు. కష్టపడి పని చేసేవారికి సంబంధించి రానున్న కాలంలో పార్టీ వారికి తగిన విధంగా బాధ్యతలు అప్పగిస్తుందని, దీనిని గుర్తెరిగి పనిచేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్ చార్జులు వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్ అనే అంశంపై సమావేశాలు నిర్వహించాలని కోరారు. మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు రానున్న తరుణంలో పార్టీ శ్రేణులంతా ప్రతిపక్షాల విమర్శలను ఎక్కడికక్కడ...ఎప్పటికప్పుడూ తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి వారి ఆరోపణలను నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. జగన్ నాలుగేళ్లల్లో ప్రజలకు అమలు చేసిన కార్యక్రమాలు, అందించిన పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ముమ్మరంగా తీసుకెళ్లాలని కోరారు. జగన్ పరిపాలనకు ప్రజల్లో ఆదరణ రోజు రోజుకు పెరుగుతోందన్నారు. ఓటర్ల జాబితా తుది దశలో ఉన్నందున, పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ చార్జ్‌లు, పరిశీలకులు, జేసీఎస్ కో-ఆర్డినేటర్లు సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి అన్ని అంశాలను పరిగణనలోనికి తీసుకుని పనిచేయాలని కోరారు.

సంపాదకీయం

సంస్కరణల మిషతో మరింత కరకుదనం

పాత పథకాలకు కొత్త పేర్లు తగిలించి తమ పథకాలుగా చెలామణి చేసుకోవడంలో అద్వితీయ నైపుణ్యం ఉన్న బీజేపీ ప్రభుత్వం బ్రిటిష్ కాలం నాటి మూడు చట్టాలను మారుస్తున్నామని నమ్మించి ఆ చట్టాలను అంతకన్నా కిరాతకంగా తయారు చేయడానికి సిద్ధమైంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు వర్షాకాల సమావేశాల ఆఖరిరోజున 1860నాటి భారత శిక్షా స్మృతికి బదులు భారతీయ న్యాయ సంహిత, నేరవిచారణా ప్రక్రియ చట్టానికి బదులు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, సాక్ష్యాధారాల చట్టానికి బదులు భారతీయ సాక్ష్య బిల్లులు ప్రతిపాదించారు. వీటిని కేంద్ర హోం మంత్రిత్వశాఖకు అనుబంధంగా ఉన్న పార్లమెంటరీ స్థాయీ సంఘ పరిశీలనకు పంపి ఆ తరవాత పార్లమెంటు ఆమోదం పొందుతారట. మోదీ హయాంలో పార్లమెంటరీ కమిటీల ప్రస్తావన చాలా అరుదుగా తప్ప వినిపించని దశలో ఈ మూడు బిల్లులను పార్లమెంటరీస్థాయీ సంఘానికి పంపడం ఆహ్వానించదగిన పరిణామమే. వలసవాదపాలన నాటి చట్టాల స్థానంలో ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా భారతీయ చట్టాలను తీసుకు రావడం సమంజసమే కానీ మునుపటి చట్టాలకన్నా ఈ బిల్లులు మరింత కర్కోటకంగా కనిపిస్తున్నాయి. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 124(ఎ) దేశ ద్రోహానికి సంబంధించింది. ఇది బ్రిటిష్ హయాంలో అమలులోకి వచ్చింది. బాల గంగాధర్ తిలక్, మహాత్మా గాంధీ లాంటి వారిమీద ఈ సెక్షన్ ఆధారంగానే దేశద్రోహ ఆరోపణలు మోపారు. స్వాతంత్ర్యంవచ్చిన తరవాత చట్టంలో దేశద్రోహానికి ఇంకా అవకాశం ఉండడం అత్యంత గర్హనీయమే. కానీ ఇప్పటిదాకా కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా దేశద్రోహ చట్టాన్ని మాత్రం తొలగించలేదు. ఇప్పుడు దాన్ని తొలగిస్తున్నామని అమిత్ షా గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ భారతీయ న్యాయ సంహిత బిల్లులోని 150వ సెక్షన్ బ్రిటిష్ హయాం నాటికన్నా కఠినంగా ఉంది. అంటే వలసవాద చట్టాలను మార్చేస్తున్నామని అమిత్ షా చెప్పడం వచ్చి మోసమే. దేశద్రోహ చట్టానికి చేస్తున్నామంటున్న మార్పులు కొత్త బిల్లు ద్వారా మరింత కిరాతకంగా మారతాయి. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంలోని (యుఏపీఏ) అంశాలన్నీ కూడా కొత్త బిల్లులో ఉన్నాయి. అమిత్ షా చెప్తున్న మార్పు ఎంత మాత్రం సంస్కరణ కాదు. అది కేవలం ప్రతీకాత్మకమైన మార్పే. ఇంగ్లీషు పేరు పోయి హిందీ పేరు వస్తుంది. ఆ హిందీ కూడా సంస్కృత భూయిష్టమైంది. అంటే మార్పు మోసపూరితమైందే. మన న్యాయ ప్రక్రియ అంతా ఇంగ్లీషులో సాగుతున్నప్పుడు చట్టాలకు హిందీ పేర్లు పెట్టడంవల్ల ఒరిగేది ఏమీఉండదు. ఇది హిందీని రుద్దడానికి దొడ్డి దారిన బాహాటంగా ప్రయత్నించడమే. ఈ బిల్లుల్లో కొన్ని సానుకూల అంశాలూ లేకపోలేదు. మూక దాడులకు, హత్యలకు మరింత కఠినమైన శిక్షలు ఈ బిల్లుల్లో సిఫార్సు చేశారు. 18ఏళ్ల కన్నా లోపు ఉన్న మహిళల మీద మూకుమ్మడి అత్యాచారాలకు కూడా మరణ శిక్ష దాకా విధించే ఏర్పాటు ఈ బిల్లుల్లో ఉంది.

మరణశిక్ష విధించే అవకాశం ఎగిరి గంతులేయాల్సింది ఏమీ కాదు. అనేక దేశాలు మరణశిక్షను రద్దు చేశాయి. కొన్ని దేశాల్లో రద్దు చేయకపోయినా విధించడంలేదు. కానీ అమిత్ షా ప్రవేశ పెట్టిన బిల్లుల్లో మరణశిక్ష విధించే వెసులుబాటు ఉండడం తీవ్రమైన శిక్ష విధిస్తే నేరాలను అదుపు చేయవచ్చునన్న తప్పుడు అవగాహనకే సంకేతం. మన దేశంతో సహా మరణశిక్ష విధించే అవకాశం ఉన్న ఏ దేశంలోనూ హత్యలు, ఘోరమైన నేరాలు తగ్గిన దాఖలాలు లేవు. మరణ శిక్ష విధించడం అంటే రాజ్య వ్యవస్థ దోషులనుకున్న వారిని హతమార్చడానికి అనుమతించడమే. బ్రిటిష్ వలసవాదులు భారతీయులను తమ శత్రువులుగా భావించారు. ప్రజల హక్కులను హరించారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఇంతకన్నా భిన్నంకాదు. ఈ కొత్త బిల్లులు శిక్షించడానికి కాదనీ, ప్రజలకు న్యాయం చేయడానికేనని అమిత్ షా చేసిన వ్యాఖ్యలు పూర్తిగా మోసపూరితమైనవే. బీజేపీ తమ పాలనను భారతీయత అని బాకా ఊదుకుంటున్నా సారంలో వలసవాద ప్రజావ్యతిరేక విధానాలను ఏ మాత్రం విడనాడలేదు. ప్రజల హక్కులను కాలరాయడం మానలేదు. ప్రజలను బీజేపీ శత్రువుల్లాగే భావిస్తోంది. దేశద్రోహ నిబంధనకు బదులు భారతీయ న్యాయ సంహితలో 124(ఎ) సెక్షన్ లో ఉన్న దానికన్న ఎక్కువ కఠినమైన అంశాలను చేర్చారు. 124(ఎ)లో ఇదివరకు ఉన్న అంశాలకు తోడు ప్రస్తుత కాలంలో ఎలక్ట్రానిక్ పద్ధతి లాంటి మార్పులను మాత్రమే చేర్చి ఈ బిల్లులను మరింత వికృతీకరించారు. దీనికి జీవిత ఖైదు, లేదా ఏడేళ్ల శిక్ష, జరిమానా లాంటివి చేర్చారు. కొత్త బిల్లులో ఉన్న వేర్పాటువాదం అన్న మాటకు నిర్వచనం ఎక్కడా లేదు. అంటే తమకు అనువుగా ఆ మాటను విడమర్చడానికి అవకాశాన్ని బీజేపీ ప్రభుత్వం అట్టి పెట్టుకుంది. వాస్తవానికి దేశద్రోహ చట్టాన్ని అమలు చేయకూడదని సుప్రీంకోర్టు ఏడాది కిందట ఎన్.వి.రమణ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు రమణతో పాటు న్యాయమూర్తులు సూర్యకాంత్, హిమాకొహ్లీతో కూడిన బెంచి తీర్పు చెప్పింది. 124(ఎ) ను అమలు చేయకుండా ఉండడంతో పాటు దీన్ని సమీక్షించాలని సుప్రీంకోర్టు తెలియజేసింది. ఇప్పటికే ఉన్న కేసులలో బలాత్కారానికి పాల్పడకూడదని కూడా చెప్పింది. అప్పటి నుంచి 124(ఎ) సెక్షన్‌ను అమలుచేయకుండా పక్కన పెట్టారు. ఇప్పుడు ఆ తీర్పును వమ్ముచేసి ఆ అంశాలకు మించిన అంశాలను చేర్చి అమలు చేయడానికి వీలుగా భారతీయ న్యాయ సంహితలో వెసులుబాటు కల్పించారు. కొత్త బిల్లుల్లో అమిత్ షా చేసిందల్లా దేశద్రోహం లేదా రాజద్రోహం అన్న మాటను తొలగించడమే. ప్రభుత్వాన్ని వ్యతిరేకించడాన్ని దేశద్రోహంగా పరిగణించే పార్టీ నుంచి అంతకన్నా ఏం ఆశించగలం!

పాలనాపరమైన చర్యలను లేదా ప్రభుత్వ చర్యలను విద్వేషం రెచ్చగొట్టడానికి, ఏహ్యాభావం పెంచడానికి, అసంతృప్తి వ్యక్తం చేయడానికి వాడుకోనంత కాలం కొత్త బిల్లు కింద నేరంకాదని అమిత్ షా చెప్పడం సన్నాయి నొక్కులు నొక్కడమే. ఇప్పటి వరకు మోదీ హయాంలో మోపిన దేశద్రోహ కేసులు ఏవీ ఈ సంయమనాన్ని పాటించిన ఉదంతమేలేదు. ఉన్న వెసులుబాట్లలోని సందిగ్ధతను తమను అనుకూలంగా మార్చుకునే పాలకవర్గాలు చట్ట స్ఫూర్తిని గ్రహిస్తాయని చెప్పలేం. రాజకీయ ప్రాబల్యం ఉన్న నేరస్థులకు ప్రభుత్వం ఇష్టానుసారంగా శిక్ష తగ్గించడానికి వీలులేకుండా ఈ బిల్లులు రూపొందించామని చెప్పడానికి అమిత్ షా బిహార్‌లో ఆనంద్ మోహన్ విడుదలను ఉదహరించారు. కానీ 2002 నాటి గుజరాత్ మారణకాండలో మూకుమ్మడి అత్యాచారానికి బలైన బిల్కిస్ బానూ వ్యవహారంలో శిక్షపూర్తి కాకుండానే దోషులను విడిచిపెట్టింది. బీజేపీ ప్రభుత్వమేనన్న వాస్తవాన్ని అమిత్ షా మరుగుపరిచారు. చట్టం ఎంత కఠినమైంది, సవివరమైంది అన్న దానికన్నా దాన్ని వినియోగిస్తున్న వారిఉద్దేశం ఏమిటి అని చూసినప్పుడు బీజేపీ చట్టస్ఫూర్తిని పట్టించుకున్న దాఖలాలేలేవు. అమిత్ షా ప్రతిపాదించిన బిల్లులు కాయకల్ప చికిత్సకన్నా హీనం.

పీడిత, తాడితుల గళం గుజ్జుల

ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి, అఖిలభారత స్థాయిలో వ్యవసాయ కార్మికసంఘం నిర్మాణం-ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి గుజ్జుల యల్లమందారెడ్డి (1923-1997). భూమికోసం, భుక్తికోసం పేద ప్రజలను సమీకరించి అనేక పోరాటాలను నిర్వహించారు. వెంకటగిరి జమిందారీ వ్యతిరేకపోరాట యోధుడు గుజ్జుల యల్లమందారెడ్డి! ప్రజాప్రతినిధిగా, ప్రజా ఉద్యమ నేతగా ఆయన ప్రకాశంజిల్లాపై చెరగని ముద్ర వేశారు. పార్లమెంట్‌లో ప్రజావాణిని వినిపించిన జననేత ఆయన. 1962లో ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం నియోజక వర్గం నుంచి ఆయన లోకసభకు ఎన్నికయ్యారు. యల్ల మందారెడ్డి నెల్లూరు జిల్లా కనిగిరి తాలూకా (ప్రస్తుతం ప్రకాశం జిల్లా) నేరేడుపల్లెలో పేద రైతు కుటుంబంలో 1923లో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గురవమ్మ, కోటిరెడ్డి. 1939 నుంచి 1942 వరకు ఒంగోలు హైస్కూల్‌లో చదువుతున్నప్పుడే అనేక విద్యార్థి పోరాటాలను జయప్రదంగా నడిపారు. 1941లో ఎబిఎం హైస్కూల్‌లో డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా, విద్యార్థుల ఇతర సమస్యలపై జరిగిన చరిత్రాత్మక సమ్మెకు యల్లమందారెడ్డి నాయకత్వం వహించారు. హైస్కూల్ విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షులుగా పనిచేశారు. అనంతరం నెల్లూరు వీఆర్ కాలేజిలో విద్యాభ్యాసం కొనసాగించారు. అక్కడ చదువుతున్నప్పుడే 1943లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొందారు. 1960-1962 మధ్యకాలంలో తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ సెనెట్ సభ్యునిగా పనిచేశారు. 1952లో రహస్య జీవితం నుండి బయటకురాగానే పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. జైలు నుంచే కనిగిరి నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ దాఖలుచేసి ఘన విజయం సాధించారు. మద్రాస్ అసెంబ్లీ సభ్యులుగా వుంటూ ఆంధ్రరాష్ట్ర నిర్మాణం, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ సాధన వంటి తదితర సమస్యలపై ఆందోళన సాగించారు. ఆ తరువాత 1953-56,1956-62 ఎన్నికలలో కూడా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1959-1962 మధ్య అసెంబ్లీలో సీపీఐ పక్ష ఉపనేతగా ప్రజాసమస్యలను సభ ముందుంచడంలో కృతకృత్యులయ్యారు. 1962 సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గం నుంచి లోకసభకు ఎన్నికయ్యారు. 1963, డిసెంబర్‌లో ప్రభుత్వం ఆయనను అరెస్టుచేసి రాజమండ్రి, హైదరాబాద్ జైళ్లలో 1964 ఏప్రిల్ వరకు డిటెన్యూగా వుంచింది. 1966లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధనకోసం ప్రారంభమైన ఉద్యమంలో పాల్గొన్నారు. ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కోరుతూ 1966 నవంబర్‌లో లోకసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికుల సమస్యలపై యల్లమందారెడ్డి అలుపెరగని



పోరుసల్పారు. వెంకటగిరి జమీందారీ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం నిర్మించారు. 1947లో జమీందారీ రద్దు చట్టంకోసం ప్రత్యేక రైలులో మద్రాసు వెళ్లిన యాత్రా దళంలో ఆయన సభ్యులుగా ఉన్నారు. 1948లో ఆయనపై అరెస్ట్ వారెంట్ జారీ అయినప్పటికీ ప్రభుత్వానికి చిక్కకుండా నాలుగేళ్లు రహస్య జీవితం గడిపారు. కనిపిస్తే కాల్చి చంపమని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాని ప్రజలు కంటి పాపవలే యల్లమందారెడ్డిని రక్షించారు.

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీలో నాయకత్వ బాధ్యతలు నిర్వహించిన యల్లమందారెడ్డి ఆ తరువాత కాలంలో కేంద్ర కార్యదర్శివర్గానికి ఎన్నికయ్యారు. అప్పటి పార్టీ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు ప్రోత్సాహంతో భారతీయ ఖేత్ మజ్దూర్ సంఘ్ (బీకేఎంయూ-వ్యవసాయ కార్మికసంఘం) అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. అనేక రాష్ట్రాలకు వెళ్లి సంఘం నిర్మాణాన్ని విస్తరించారు. యల్లమందారెడ్డి భార్య సరళాదేవి భర్తతోపాటు కమ్యూనిస్టు ఉద్యమంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సమాఖ్య నిర్మాణంలో దీర్ఘకాలం పనిచేసిన అనంతరం భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై మహిళాభ్యున్నతికి జీవితాంతం ఉద్యమకారిణిగా కొనసాగారు. వీరి ఏకైక కుమారుడు డా.గుజ్జుల రవీంద్ర జర్మనీలో సెనేటర్‌గా ఉంటున్నారు. గుజ్జుల యల్లమందారెడ్డి 1997 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో కన్నుమూశారు.

(నేడు గుజ్జుల శతజయంతి సందర్భంగా)

-మోదుమూడి మురళీకృష్ణ

రద్దయిన 'కౌ హగ్గింగ్ డే'

డాక్టర్ దేవరాజు మహారాజు

విద్య అసలు లక్ష్యం సమాధానాలను అందించడం కాదు, మరిన్నిప్రశ్నలు సంధించడం ఎలాగో నేర్పించడం!

-హెలెన్ కెల్లర్ అమెరికన్ రచయిత్రి, ఉపాధ్యాయురాలు.

ఈ దేశంలో ముప్పయి అయిదు స్మృతులున్నాయి. అందులో లభించినవి ఇరవై అయిదు మాత్రమే. అందులో అతి ముఖ్యమైంది మనుస్మృతి. ఒక రకంగా ఈ దేశంలో పాత రాజ్యాంగం మనుస్మృతే. ఆ మనుధర్మ శాస్త్రంలో నేరస్థులకు వేసే శిక్షలు ఇలా ఉన్నాయి. వీటిలో ఉన్న తేడాల్ని శ్రద్ధగా గమనించాలి. శిక్ష ఎవరికైనా కానీయండి, లాభం మాత్రం బ్రాహ్మణవర్గానికి చేకూరేవిధంగా రాసుకోవడం ఇక్కడ గమనించాల్సిన విషయం.

1. బ్రాహ్మణుడు క్షత్రియుడ్ని చంపితే-వేయి ఆవులు, ఒక ఎద్దు-ఉత్తమ బ్రాహ్మణుడికి ఇవ్వాలి. అదే దోష పరిహారం. అదే శిక్ష (మనుధర్మం11-127)

2.బ్రాహ్మణుడు వైశ్యుణ్ణి చంపితే దోషపరిహారంగా వంద ఆవులను, ఒక ఎద్దును మరొక బ్రాహ్మణోత్తముడికి దానం ఇవ్వాలి (మనుధర్మం 11-128)

3.ఒకవేళ బ్రాహ్మణుడు శూద్రుణ్ణి చంపితే-పది ఆవులు, ఒక ఎద్దును, మరో బ్రాహ్మణోత్తముడికి దానం ఇవ్వాలి (మనుధర్మం 11-130)

4. ఇక బ్రాహ్మణుణ్ణి చంపడం కంటే మహాపాపం ఈ భూమి మీద మరొకటి లేదు. కాబట్టి రాజు కూడా బ్రాహ్మణుణ్ణి చంపకూడదు. అసలు ఆ ఆలోచనే మానుకోవాలి (మనుధర్మం 8-361)

ఏకపక్షంగా సాగిన శిక్షలు (దానాలు) పాపం పేరుతో పరిపాలకుల చేతులు కూడా కట్టేశాయి. మనుస్మృతి సహాయంతో సమాజంలో తమ స్థాయి అత్యున్నతంగా నిలుపుకున్న బ్రాహ్మణ వర్గమేమీ ప్రత్యేకంగా అవతరించినవారు కాదు. జీవపరిణామ క్రమంలో ఏర్పడ్డ ఆ మహా మిశ్రమ సంతతివారే. వారి కుట్రలు, కుతంత్రాల సహాయంతో తమని తాము ప్రత్యేకంగా నిలుపుకున్నారు. వారి మనుస్మృతి నిజమైతే-మరి రావణుణ్ణి రాముడెలా చంపాడూ? వారు రాసుకున్న రామాయణంలోనే రావణుడు బ్రాహ్మడు. రాముడు క్షత్రియుడు. బ్రాహ్మణుణ్ణి క్షత్రియుడు చంపితే హర్షిస్తున్నారెందుకూ? రాముడికి శిక్షపడాలి కదా? ఆ విషయం ఎందుకు ఆలోచించరూ? ఎప్పుడో రాసిన మనుస్మృతిలోని అంశాలు యథాతథంగా సమాజంలోని అన్నివర్గాలు ఇప్పుడు కూడా ఆచరించాలని మనువాదులు ఆరాటపడుతుంటారు. కాలానుగుణంగా వస్తున్న మార్పుల్ని, నూతన ఆవిష్కరణల్ని వారు పరిగణనలోకి తీసుకోరు. వారి పూర్వీకుల అడుగుజాడల్లో నడుస్తూ కొందరు సమకాలీన అంశాలను కూడా తమ మనుస్మృతిలో రాసినట్టు భ్రమిస్తూ ఉంటారు. లేదా మనుస్మృతికి అనుగుణంగా తామే కథలు అల్లుతుంటారు. అలాంటికొన్ని అసంబద్ధమైన విషయాలు పరిశీలిద్దాం. అలాంటి వాటిని నమ్మకుండా ఉండగలగాలి. తెలివిగా తిప్పికొడుతూ విషయం జనబాహుళ్యానికి తెలియజేయాలి. ఇది అందరి సమిష్టి బాధ్యత! ఉదాహరణకు డైనోసార్స్ అంతరించి పోయిన జంతువులు. అవి ఉన్న

కాలంలో దేవుడిని సృష్టించుకున్న మనిషిలేడు కాబట్టి! కానీ, పంజాబ్ యూనివర్సిటీకి చెందిన మనువాది ఒక కొత్త విషయం కనిపెట్టాడు. ఆయనొక భూ విజ్ఞాన శాస్త్రవేత్త. పేరు అశుఖోస్లా. డైనోసార్లను తొలిసారి కనిపెట్టింది బ్రహ్మదేవుడే" అని ప్రకటించాడు. దానికి సంబంధిత ప్రస్తావన వేదాల్లో ఉందని బల్లగుద్ది చెప్పాడు. ఎక్కడ ఉంది? ఎలా ఉంది? వివరంగా చెపితే అందరికీ బోధపడేది కదా? బ్రహ్మ ఒక కల్పించుకున్న దేవుడు. డైనోసార్లు ఈ భూమిమీద పుట్టి, కొన్ని వేల ఏళ్లపాటు తమ ఉనికి చాటుకుని కాలక్రమంలో అంతరించిపోయిన జీవులు. వాటిని బ్రహ్మదేవుడు కనిపెట్టడమేమిటీ? ఇతర దేశస్తులకు డైనోసార్ల గురించి తెలుసు కానీ, హిందూపురాణాల్లోని బ్రహ్మదేవుడి గురించే తెలియదు. ప్రపంచ దేశాల వైజ్ఞానికులంతా అంగీకరిస్తేనే ఏదైనా వైజ్ఞానిక అంశంగా గుర్తించడమవుతుంది. ఆధారాలు లేకుండాచేసే మూర్ఖపు ప్రకటనల్ని శాస్త్ర జగత్తు అంగీకరించదు. డైనోసార్ల మీద పరిశోధనలు చేసినవారి విలువ తగ్గించడానికి అశుఖొస్లా అనేవాడు ఒక అబద్ధం ప్రకటించాడు. పోనీ, మన దేశంలోని ప్రఖ్యాత వేద పండితులైనా బ్రహ్మదేవుడి పరిశోధనల గూర్చి మాట్లాడలేదు. వేదాలలో ఏమున్నదో వారికి బాగా తెలుసుకదా?

మనదేశంలో నేటి దేశభక్తుల తెలివి మామూలుగా ఉండడంలేదు. వారుచేసిన, చేస్తున్న ప్రచారాలు ఎలా ఉంటున్నాయో అందరికీ తెలుసు. అందులో ఒకటి ఇలా ఉంది. "గోవుని హత్తుకోవడంవల్ల ఆక్సిటోసిన్- అనే హార్మోన్ విడుదల అవుతుంది. తద్వారా ఒంటరితనం ఉండదు. మానసిక ఆందోళన తగ్గుతుంది. అని క్రైస్తవ దేశమైన నెదర్లాండ్‌లో ఆ దేశపు యూనివర్సిటీ ప్రకటించింది. మరి ఈ విషయం ఇక్కడి గొర్రెలకు ఎప్పుడు అర్థమవుతుందో" అనే ఒక పోస్టర్ జై గోమాత శీర్షికతో ప్రచారమైంది. జై గోమాత శీర్షికతో ఇలాంటివి ఎవరు ప్రచారం చేస్తారో వేరే చెప్పనక్కరలేదు కదా? సరే ఇదే విషయం మనం కొంచెం లోతుగా ఆలోచిద్దాం! అప్పుడు గొర్రెలెవరో బాగా తెలుసుకోవచ్చు. మన మెదడులో హైపోథాలమస్ అనే భాగం ఉంటుంది. ఇది రక్తపోటును, గుండె కొట్టుకునే విధానాన్ని, శరీర ఉష్ణోగ్రతని, జీర్ణవ్యవస్థని ప్రభావితం చేస్తుంది. మెదడు కింది భాగంలో ఒక చిక్కుడు గింజంత పరిమాణంలో పిట్యుటరీ గ్రంధి ఉంటుంది. ఇక, ఆక్సిటోసిన్ అనేది ఒక హార్మోన్, హార్మోన్ అంటే రసాయనిక పదార్థం. ఈ ఆక్సిటోసిన్ హైపోథాలమస్‌లో ఉత్పత్తిఅయి కింద ఉన్న పిట్యుటరీ గ్రంధిలో నిలువఉంటుంది. ఆ హార్మోన్ అవసరమైనప్పుడు రక్తప్రవాహంలో కలిసి శరీరంలో ఏ భాగానికి అవసరమైతే ఆ భాగానికి చేరుకుంటుంది. ముఖ్యంగా ఈ హార్మోన్ స్త్రీ పురుష ప్రత్యుత్పత్తి అవయావాలకు అందుతుంది. స్త్రీలలో కాన్పుజరగడానికి, కాన్పు తర్వాత పాలు పడడానికీ ఈ ఆక్సిటోసిన్ హార్మోన్ ఉపయోగపడుతుంది. ఇవీ ఆక్సిటోసిన్‌కు సంబంధించిన వైజ్ఞానిక వివరాలు. రోడ్డుమీద గోవు కనపడగానే ఎవరుపడితేవారు హత్తుకుంటే ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదలకాదు. ఆ గోవును చిన్నప్పటి నుండి పెంచుకున్నవారికి దానిమీద ప్రేమ ఉంటుంది. అలాంటి వారు దాన్ని హత్తుకుంటారు. వేరే వాళ్లకు ఆ కోరికే కలగదు. గోవు ఏమైనా గర్ల్‌ఫ్రెండా? జీవిత సహచరా? అదొక జంతువు. కౌగలించు కున్న వాడు మనిషి. హార్మోన్లు ఉత్పతి అయ్యే అవకాశమే ఉండదు. నెదర్లాండ్ కాదు గదా ప్రపంచంలో ఏ యూనివర్సిటీ ఈ విషయం ప్రకటించలేదు. అదొక అబద్ధం. తెలివి లేని గొర్రెలే ఇలాంటివి నమ్ముతారు. ఒకటి, రెండు సైన్సుపదాలు పట్టుకుని జనాన్ని మభ్యపెట్ట దానికి దేశభక్తులు చేసే వ్యర్థ ప్రయత్నం ఇది. శ్రీరాముడు మోదీ రూపంలో అవతారం ఎత్తాడు- అని దేశ భక్తులు భజన చేయడం ప్రారంభించారు. అంతేకాదు, లక్ష్మణుడు, అమిత్ షా రూపంలో జన్మించాడట. ఇక హనుమంతుడు ఆదిత్యనాథ్ రూపం దాల్చాడటం.

ఈ దేశంలో రామరాజ్యం కలను వీళ్లంతా నిజం చేయడానికి సంకల్పించారట. ఇకపోతే బెంగాల్ సీఎం మమతా బెనర్జీని శూర్పణఖతో పోల్చాడు ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎం.ఎల్.ఏ సురేంద్ర సింగ్. బావుంది. పోలికలన్నీ బాగానే ఉన్నాయి. కానీ, ఆ ఎంఎల్ఏ సురేంద్రసింగ్ ఇంకా ఒక విషయం చెబితే బావుండేది. రాముడు సీతను ఏ అడవిలో వదిలేశాడో కూడా చెప్పాల్సింది. ఏమైనా అతనివల్ల ఒక మేలు జరిగింది! ఇంతవరకూ ఉన్న 'రామరాజ్యం' భ్రమల్ని బద్దలుకొట్టాడు. రామరాజ్యం ఇంత హీనంగా ఉంటుందన్న నిజాన్ని చెప్పి, ప్రజల కళ్లు తెరిపించాడు. ముస్లింల పేర్లు ఉస్మాన్ ముస్లిం అని ప్రకటించాడు. మరో దేశభక్తి నేత హిందీలో మాట్లాడం అని అనేవారు. దేశం వదిలి వెళ్లాలని ఒకయూపీ దేశభక్తుడు ఆజ్ఞాపిస్తే, తమిళనాడు విద్యామంత్రి సవినయంగా ఇలా నివే దించుకున్నాడు. "అయ్యా! హిందీ వచ్చినవాళ్లు మా కోయంబత్తూర్‌లో పానీపురి అమ్ముకుంటున్నారు. ఏం ఫరవాలేదు. మాకు తమిళం, ఇంగ్లీషు భాషలు చాలు" అని ప్రకటించాడు మంత్రి కె.పొన్ముడి. ఎక్కువ మాట్లాడితే మాకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని డిమాండ్ చేస్తాం" అని కూడా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం ఒక హెచ్చరిక చేసింది.

కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

మొండి బాకీలను మరుగున పెడుతున్న బ్యాంకులు

రుణ ఎగవేత దారులకు బాధ కలగకుండా మొండి బాకీలకు బ్యాంకులు పెట్టిన పేరు నాన్ పెర్‌ఫార్మింగ్ ఎస్సెట్స్ (ఎన్.పి.ఎ). వాటినే నిరర్థక ఆస్తులు అంటున్నారు. బ్యాంకులు ఇతరులకిచ్చిన రుణాలను ఆస్తులుగా పరిగణిస్తాయి. బ్యాంకులకు చెల్లించవలసిన రుణ వాయిదాను బకాయిపడిన 90 రోజులులోగా చెల్లించకపోతే ఆ రుణాన్ని ఎన్.పి.ఎ.గా భావిస్తారు. దేశ ఆర్థికవ్యవస్థకు ద్రవ్యోల్బణం అదుపుచేయటం ఎంత ముఖ్యమో, బ్యాంకింగ్ రంగంలో నిరర్థక ఆస్తుల కట్టడి అంత ముఖ్యం. నూటికి నూరుశాతం రుణాలు వసూళ్ళు ఆచరణ సాధ్యంకాదు. కనుక రానిబాకీలను ఎన్.పి.ఎ.లుగా వర్గీకరించటం, వసూళ్ళకు చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసిన తరువాత వాటిలో కొన్ని మాఫీచేయటం ఆనవాయితీ. ప్రస్తుతమున్న కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నిరర్థక ఆస్తులు తీవ్రంగా పెరుగుతున్నాయి. బ్యాంకు డైరెక్టర్లను రాజకీయంగా ప్రభావితంచేసి రుణాలు పొందటం, ఎగవేయటం లాంటి దుస్సంప్రదాయం పెరిగింది. తీసుకున్న రుణాలను ప్రక్కదారులకు మళ్లించటం, ఆర్థిక అవకతవకలకు పాల్పడటం, చేతులెత్తేయటం కొన్ని కార్పొరేట్ సంస్థలకు రివాజుగా మారింది. దేవాన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (డి.హెచ్.ఎఫ్.ఎల్) సంస్థ దివాళాకు ఇదే కారణం. దీనికి 17 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు కలిసి మొత్తం రూ.34615 కోట్లు రుణాలు ఇచ్చాయి. గుజరాత్‌కు చెందిన ఎ.పి.జి షిప్ యార్డు సంస్థ ఏకంగా 28 బ్యాంకులకు రూ.22,800 కోట్ల మేరకు టోకరా ఇచ్చింది. ఇది కూడా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు కలిపి ఇచ్చిన రుణం. రుణాలు తీసుకొని విదేశాలకు పారిపోయిన వారు విలాసవంతమైన జీవితాలు సాగిస్తున్నారు. స్వదేశీ జైళ్లలో ఉన్నవారు కూడా వ్యవస్థలోని లోపాలను ఉపయోగించుకొని జైళ్లలో కంటే మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులలోనే సేద దీరుతున్నారు.

ఐదేళ్లలో రూ.10.5 లక్షల కోట్ల రుణాలు రద్దు

గత ఆర్థికసంవత్సరంలో దాదాపు రూ.2 లక్షల కోట్లు, గడిచిన ఐదేళ్లలో దాదాపు రూ.పదిన్నర లక్షల కోట్లు రుణాలు రద్దు చేసినట్లు రిజర్వుబ్యాంక్ తెలిపింది. దీనిపై ప్రతిపక్షాలు, బ్యాంకు యూనియన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. రద్దు అని రిజర్వు బ్యాంక్ వాడిన పదం కొంత గందరగోళానికి, అయోమయానికి గురిచేసింది. దీనికి అది ఇచ్చే భాష్యం కూడా కొంత కారణం. ఇన్ని లక్షల కోట్ల రూపాయలు రద్దు చేశారా? అని ప్రశ్నిస్తే...వాటిని పూర్తిగా రద్దుచేసినట్లు కాదని అంటున్నది. మరి వాటిని బ్యాంక్ బ్యాలన్స్ షీట్లో ఎందుకు చూపటం లేదని అడిగితే రద్దు ఖాతాకు మార్చామని అంటున్నది. రద్దు అంటే పూర్తిగా మాఫీకాదని ఆ రుణాల విలువను సున్నా (జీరో)కు తగ్గిస్తున్నామని, ఆ రుణాలు తీసుకున్న వాళ్ళు కట్టవల్సిందేనని రిజర్వ్‌బ్యాంక్ వాదన. ఇది కొంతమేరకు వాస్తవం. పరిశ్రమలకు, కార్పొరేట్ సంస్థకు బ్యాంకు లిచ్చిన రుణాలకు స్థిరచరాస్తులు ఎంతోకొంత తనఖా రూపేణా, మరోవిధంగా సెక్యూరిటీగా ఉండకపోవు. విదేశాలకు పారిపోయిన విజయ్ మాల్యా, నీరవ్ మోదీల రుణాలకు కూడా కొంత సెక్యూరిటీ ఉంటుంది. కోర్టుల ద్వారానో, ట్రిబ్యునల్స్ ద్వారానో వీటి నుండి పాక్షికంగా కొంత రివకరీ రాబట్టవచ్చు. ఈ విధంగా రద్దు అనే ఖాతా నుండి మూడేళ్ళలో రూ.1.09 లక్షల కోట్లు రాబట్టినట్లు రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. రుణాల రద్దు ఆషామాషీ వ్యవహారంకాదు. ఎన్ని లక్షల కోట్ల రూపాయలు రుణాలు రద్దు చేశారో అంత మొత్తం బ్యాంకు లాభాల నుండి తగ్గించుకొని వాటికి కేటాయింపులు చేయాలి. గడచిన మూడేళ్లలో రూ.5.86 లక్షల కోట్లు రుణాలు రద్దుచేయగా, రికవరీ చేసింది కేవలం రూ.1.09 లక్షలు మాత్రమే. ఇది 20శాతం కూడా లేదు. ఇలా రికవరీ కాగా ఎటువంటి సెక్యూరిటీ లేక పూర్తిగా మాఫీ అయిన రుణాలు ఏడాదికి దాదాపు రూ.లక్ష కోట్లుగా అంచనా. ఈవిధంగా గత తొమ్మిదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు, విదేశీ బ్యాంకులు దాదాపు రూ.12 లక్షల కోట్లు మాఫీ చేశాయి. అంటే అంత మొత్తం లాభాలు కోల్పోయాయి. సామాన్య కస్టమర్లు, నిజాయితీగా రుణాలు కట్టిన వారి నుండి వచ్చిన ఆదాయాన్ని కార్పొరేట్లకు, పారిశ్రామికవేత్తలకు దారపోయటం జరుగుతోంది.

కావాలని ఎగవేసే వారికీ రాయితీలు

ఉద్దేశ్యపూర్వకంగా ఎగవేసిన వారి విషయంలోనూ బ్యాంకులు ఉదారంగా వ్యవహరిస్తున్నాయి. వందల కోట్ల ఆస్థి ఉన్న వ్యక్తి పదికోట్ల రూపాయల రుణం కట్టలేదంటే అది ఉద్దేశపూర్వకంగా ఎగవేసినట్లు భావించాలి. వారికి కూడా బ్యాంకులు వడ్డీ రాయితీ ద్వారా రాజీ పరిష్కార (కాంప్రమైజ్డ్ సెటిల్మెంట్) మార్గం చూపిస్తున్నాయి. ఇలా కట్టిన వారికి 12నెలల తరువాత మళ్లీ రుణం తీసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నాయి. ఇలాంటి చర్యలు బ్యాంకింగ్ రుణవ్యవస్థ క్రమశిక్షణను దెబ్బతీస్తాయి. ఇది కార్పొరేట్ సంస్థలకు తప్పుడు సంకేతాలిచ్చినట్లు అవుతుంది. అసలు పాక్షికంగా రికవరీకి అవకాశమున్న రుణాలను రద్దు ఖాతాకు బదిలీచేయటానికి రిజర్వ్‌బ్యాంక్ చెప్పిన కారణాలు సమంజసంగా లేవు. పన్నులభారం తగ్గించుకోవడానికి ఈ ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. పన్నులభారం తగ్గించుకోవడానికి ప్రక్కదారులు తొక్కితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. కోట్లాది రూపాయల ఆదాయాన్ని వదులుకోదు. బ్యాంకులు ఆదాయాన్ని పెంచుకునే మార్గం ఆలోచించాలి. పన్నులు కట్టాలనే సాకుతో రుణాలు రద్దుచేసి, ఉన్న ఆదాయం నుండి వాటికి కేటాయింపులు చేయటం సరికాదు. నిరర్థక ఆస్తులు తక్కువచేసి చూపడానికి, కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చడానికి మాత్రమే ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు భావించవలసి వస్తుంది. మన బ్యాంకులు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగివున్నాయని చూపడానికి పడే తాపత్రయంతప్ప ఇది మరొకటి కాదు. గత ఐదేళ్లలో రద్దుచేసిన రుణాలను నిరర్థక ఆస్తులలో కలిపితే ఇప్పుడున్న ఎన్.పి.ఎ.ల రేటు 3.9శాతం నుండి దాదాపు రెట్టింపు అవుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చితే చాలా ఎక్కువ. అనారోగ్యాన్ని గుర్తించి వైద్యం చేయాలి. లేదని భావిస్తే పరిస్థితి విషమిస్తుంది.

ఎస్.జి.కె.

7న యూరప్ దేశాలకు రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ త్వరలో యూరోపియన్ దేశాల్లో పర్యటించనున్నారు. యూరోపియన్ యూనియన్ పార్లమెంటు సభ్యులతో బ్రసెల్స్‌లో ఆయన సమావేశమవుతారు. ఫ్రాన్స్, బెల్జియంలలో భారతీయ మూలాలు గల వారిని కలిసే అవకాశం ఉంది. నార్వేను కూడా ఆయన సందర్శించనున్నారు. రాహుల్ గాంధీ సెప్టెంబరు 7 నుంచి 11 వరకు బెల్జియం, నార్వే, ఫ్రాన్స్ దేశాల్లో పర్యటించబోతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాదిలో ఆయన బ్రిటన్, అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో బ్రిటన్‌లోనూ, జూన్‌లో అమెరికాలోనూ ఆయన పర్యటించారు. బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ప్రజాస్వామ్యం దాడికి, ఒత్తిళ్లకు గురవుతోందని ఆరోపించారు. దేశంలోని అన్ని వ్యవస్థలూ కబ్జాకు గురయ్యాయని, మీడియా, న్యాయ వ్యవస్థలను నియంత్రిస్తున్నారని, కేంద్ర దర్యాప్తు సంస్థలు బెదిరిస్తున్నాయని, దళితులు, గిరిజనులు, అల్ప సంఖ్యాకులపై దాడులు జరుగుతున్నాయని, అసమ్మతిని అణచివేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆయనపై బీజేపీ తీవ్రంగా విరుచుకుపడింది. విదేశీ గడ్డపై నుంచి భారతదేశాన్ని కించపరుస్తున్నారని ఆరోపించింది.

బీజేపీ మహిళా నేత మిస్సింగ్ కేసులో భర్త అరెస్టు

ముంబై: పది రోజులుగా కనిపించకుండాపోయిన నాగపూర్‌కు చెందిన బీజేపీ నేత సనాఖాన్ కేసులో పోలీసులు ఆమె భర్తను అరెస్టు చేశారు. సనాను ఆమె భర్తే హత్య చేసినట్లు పోలీసులు ధృవీకరించారు. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన సనాఖాన్ బీజేపీ మైనార్టీ సెల్ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. ఆమె ఆగస్టు ఒకటిన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు వెళ్లారు. అప్పటి నుంచి నుంచి ఆమె కనిపించలేదు. తన భర్తను కలిసేందుకు ఆమె అక్కడికి వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. జబల్‌పుర్ చేరుకున్న తర్వాత సనా తన తల్లికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. భర్త అమిత్ సాహును కలిసి రెండు రోజుల్లో తిరిగిరావాల్సి ఉందని వారు తెలిపారు. కానీ ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అని రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమిత్ సాహు మద్యం అక్రమరవాణా వ్యాపారం చేస్తుంటాడని, ఓ దాబా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక లావాదేవీల విషయంలో సనా, అమిత్ మధ్య కొద్దికాలంగా గొడవలు ఉన్నాయి. ఆమె జబల్‌పూర్ వచ్చిన సమయంలోనూ అదే విషయమై వారిద్దరు గొడవపడ్డారని, అది కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీయడంతో అమిత్ దాడి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తన ఇంట్లోనే ఆమెను కొట్టడంతో మరణించిందని, తర్వాత ఆమెను హిరాన్ నదిలో విసిరేసినట్లు అమిత్ అంగీకరించాడు. ఈ కేసులో అమిత్‌తో పాటు మరో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు.

జస్టిస్ సుధీర్ సింగ్ బదిలీకి కొలీజియం మళ్లీ సిఫార్సు

న్యూఢిల్లీ: పాట్నా హైకోర్టు జడ్జి సుధీర్ సింగ్‌ను పంజాబ్, హరియాణా హైకోర్టుకు బదిలీ చేయాలని సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ సుప్రీం కొలీజియం మరోమారు సిఫార్సు చేసింది. తొలుత ఈనెల 3న జస్టిస్ సింగ్ పేరును బదిలీ కోసం సిఫార్సు చేసింది. దీనిపై జస్టిస్ సుధీర్ సింగ్ తమకు పంపిన లేఖను ఈనెల 8, 10 తేదీల్లో కొలీజియం పరిశీలించింది. తన బదిలీకి ముందు లేఖలో పేర్కొన్న వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ సింగ్ కోరారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, పాట్నా హైకోర్టు అధికారులతోనూ సంప్రదింపులు జరిపిన తర్వాతే బదిలీని సిఫార్సు చేసినట్లు కొలీజియం వెల్లడించింది. ఇందుకోసం మెమోరాండం ఆఫ్ ప్రొసీజర్‌ను అనుసరించినట్లు తెలిపింది. పాట్నా, పంజాబ్, హరియాణా హైకోర్టుల న్యాయమూర్తులతోనూ సంప్రదింపులు జరిపినట్లు వెల్లడించింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత 3వ తేదీన చేసిన సిఫార్సును పునరుద్ఘాటించినట్లు కొలీజియం తెలిపింది.

కశ్మీర్‌పై నిజాయతీ చర్చలు అవశ్యం ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్: కశ్మీర్ వివాదంపై భారత్, పాకిస్తాన్ మధ్య చర్చలు నిజాయితీగా జరగడం ఎంతైనా అవసరమని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. లేకపోతే సరిహద్దు పర్యాటకాన్ని ప్రోత్సహించడం లేక జమ్ముకశ్మీర్‌లో ర్యాలీలు చేపట్టడం పేరిట తమాషా సాగుతుందని చెప్పారు. 'జరిగిందేదో జరిగిపోయింది. ఇక రెండు దేశాలు స్వచ్ఛమైన మనస్సుతో నిజాయితీగా చర్చలు జరపాలి. యుద్ధాలతో సమస్యలు పరిష్కారం కావు. ఇందుకు ఉక్రెయిన్ దేశమే ఉదాహరణ. చనిపోతున్నది ఉక్రెయిన్ ప్రజలే. తద్వారా కలిగే ప్రయోజనం ఏముంది? సరిహద్దులు మారిపోతాయా? భారత్, పాకిస్తాన్ కూడా ఇదే విషయాన్ని గ్రహించాలి. చైనాతో జరుపుతున్నట్లుగానే భారత ప్రభుత్వం పాకిస్తాన్‌తోనూ చర్చలు జరిపితే పరిష్కారం సాధ్యమవుతుంది' అని ఫరూక్ అబ్దుల్లా తెలిపారు. సరిహద్దు పర్యాటకాన్ని ప్రోత్సహించడం, లోయలో తిరంగా ర్యాలీలు నిర్వహించడంతో కశ్మీర్‌లో పరిస్థితి మారిందా అని విలేకరులు ప్రశ్నించగా ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. జమ్ముకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు ఉన్నాయని కేంద్రం చెబుతుండటంపై స్పందిస్తూ జమ్ముకశ్మీర్‌లో నిజంగా శాంతి ఉందా? ఉంటే తూటాల మోత ఎందుకు? సైనికులు, ప్రజల హత్యలు ఎందుకు జరుగుతున్నాయి? సమస్య పరిష్కారం కాలేదని వారు (పాకిస్తాన్) భావిస్తున్నారు.. వారికి అర్థమయ్యేలా చెప్పేది ఎవరు? చర్చలతోనే సమస్యలు పరిష్కారమవుతాయి, యుద్ధాలతో కాదు' అని అన్నారు. ఉక్రెయిన్ యుద్ధం గురించి ప్రస్తావిస్తూ ఐరోపా ఆర్థికంగా నాశనమవుతోందని ఫరూక్ అబ్దుల్లా చెప్పారు. చైనాతో విదేశాంగ మంత్రి స్థాయిలో 18 సార్లు చర్చలు జరపడాన్ని గుర్తుచేశారు. సరిహద్దులు తెరుచుకోవాలనే ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అప్పుడే పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌ను చూడగలగమని, నిజమైన శాంతి ఉందని నమ్మగలమని ఎల్‌ఓసీ వెంబడి సరిహద్దు పర్యాటకాన్ని జమ్ముకశ్మీర్ యంత్రాంగం ప్రోత్సహిస్తుండటంపై ఫరూక్ అబ్దుల్లా అన్నారు.

కొత్త బిల్లులకు హిందీ పేర్లు మార్చాలి: డీఎంకే

చెన్నై: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించిన కొన్ని బిల్లులకు హిందీ పేర్లు పెట్టడాన్ని డీఎంకే తీవ్రంగా వ్యతిరేకించింది. బ్రిటిష్ కాలంనాటి మూడు చట్టాలను సంస్కరిస్తున్నామనే పేరుతో ఈ బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇండియన్ పీనల్ కోడ్-1860 స్థానంలో భారతీయ న్యాయ సంహితను, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్-1898ను భారతీయ నాగరిక్ సురక్ష సంహితను, ఇండియన్ ఎవిడెన్స్ చట్టం-1872 స్థానంలో భారతీయ సాక్ష్యను రూపొందించారు. ఈ పేర్లపై డీఎంకే ఎంపీ విల్సన్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హిందీని దేశంపై రుద్దుతోందని విమర్శించారు. ఈ మూడు బిల్లుల పేర్లను ఇంగ్లీష్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు. హిందీని తప్పనిసరి చేస్తూ అమలు చేయకూడదన్నారు. ఇలా చేయడం హిందీని తమపై రుద్దడమేనని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. దేశంలో చాలా భాషలు ఉన్నాయని, ఇంగ్లీష్ కామన్ లాంగ్వేజ్ అని చెప్పారు. ఈ మూడు బిల్లులు హిందీలో ఉన్నాయన్నారు. ఏ బిల్లు ఏమిటో ప్రజలకు అర్థం కాదని, ఆ పేర్లు పలకడం కష్టమన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ శుక్రవారం మాట్లాడుతూ ఈ మూడు బిల్లులకు హిందీ పేర్లు పెట్టడం భాషా సామ్రాజ్యవాదమని మండిపడ్డారు. ఇది సమైక్య భారత దేశ మూలాలను కించపరచడమేనన్నారు. ఇకపై తమిళం అనే పదాన్ని ఉచ్చరించడానికైనా బీజేపీకి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నైతిక హక్కు లేదన్నారు. తమ గుర్తింపును హిందీతో వెనుకకు నెట్టేందుకు జరిగే ప్రయత్నాలను దృఢంగా వ్యతిరేకిస్తామన్నారు.

ప్రత్యర్థుల గొంతు నొక్కేలా బీఎన్ఎస్ : సిబల్



న్యూఢిల్లీ: బ్రిటిష్ కాలం నాటి భారత శిక్షాస్మృతి (ఐపీసీ) స్థానె తెచ్చిన భారతీయ న్యాయ సంహిత బిల్లు (బీఎన్ఎస్) పోలీసులకు కఠినమైన అధికారాలను కట్టబెడుతుందని కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి కపిల్ సిబల్ అన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేయడమే ఉద్దేశంగా ఈ బిల్లును కేంద్రం తెచ్చిందని ఆరోపించారు. 'బీఎన్ఎస్ కింద పోలీసు కస్టడీ కాలం 15 రోజులు కాకుండా 60 లేక 90 రోజులకు పెంచవచ్చు. భద్రతను సవాల్ చేసే వ్యక్తులపై చర్యలకు కొత్త నిర్వచనాలు చెప్పబడ్డాయి. ఈ చట్టం అజెండా ప్రత్యర్థుల నోరు నొక్కేయడమే' అని సిబల్ వ్యాఖ్యానించారు. పరువునష్టం, ఆత్మహత్యాయత్నంతో పాటు అనేక నేరాలకు సంబంధించి ప్రస్తుతమున్న నిబంధనల్లో అనేక మార్పులను బీఎన్ఎస్ బిల్లు సూచిస్తుంది.

అవినీతిని భారత్ సహించదు

జీ 20 సదస్సులో మోదీ

న్యూఢిల్లీ: భారతదేశం ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతిని సహించబోదని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అవినీతి వల్ల ప్రజల జీవన నాణ్యత క్షీణిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అవినీతి ప్రభావం వనరుల వినియోగంపై ఉంటుందన్నారు. మార్కెట్లను కుదిపేస్తుందని, సేవల బట్వాడాను ప్రభావితం చేస్తుందని వ్యాఖ్యానించారు. వీటన్నింటి వల్ల భారతీయులపై వ్యతిరేక ప్రభావం పడుతుందని తెలిపారు. కోల్‌కతాలో శనివారం జరిగిన జీ20 అవినీతి నిరోధక సమావేశంలో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అవినీతి నిర్మూలన కోసం పోరాడటం తమ కర్తవ్యమని మోదీ తెలిపారు. కౌటిల్యుని అర్థ శాస్త్రాన్ని ప్రస్తావిస్తూ, గరిష్ఠ స్థాయి ప్రజాసంక్షేమం కోసం నిధులు పెంచడం ప్రభుత్వం బాధ్యతని చెప్పుకొచ్చారు. సత్యం, చిత్తశుద్ధిలను దురాశ అనేది క్షీణింపజేస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మరింత పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన వ్యవస్థను సృష్టించేందుకు టెక్నాలజీ, ఈ-గవర్నెన్స్ వ్యవస్థలను వృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రాజెక్టుల్లో లీకేజీలు, గ్యాప్‌లను అరికడుతున్నామన్నారు. లక్షలాది మంది ప్రజలు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ విధానంలో లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా సొమ్ము జమ అవుతోందన్నారు. ప్రభుత్వం ఆయుధాలు, ఇతర యంత్రాలను కొనేటపుడు అవినీతి లేకుండా, జవాబుదారీతనం ఉండేలా ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఈ పోర్టల్ చాలా పారదర్శకతను తీసుకొచ్చిందన్నారు. ఆర్థిక నేరగాళ్ల చట్టాన్ని 2018లో తీసుకొచ్చామని, ఆ తర్వాత ఆర్థిక నేరగాళ్లు, పరారైన వ్యక్తుల నుంచి 1.8 బిలియన్ డాలర్లకుపైగా రాబట్టినట్లు వివరించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం 2014 నుంచి ఆర్థిక నేరగాళ్లకు సంబంధించిన 12 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ఆస్తులు జప్తు చేసినట్లు తెలిపారు. జీ20 యాంటీ కరప్షన్ వర్కింగ్ గ్రూప్ సమావేశాలు కోల్‌కతాలో ఈ నెల 9న ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ సమావేశాల్లో జీ20 దేశాల మంత్రులు పాల్గొన్నారు.

చీలిక భయంతోనే ఓటింగ్‌కు దూరం

మణిపూర్ హింసాకాండకు సంబంధించి విపక్ష 'ఇండియా'పై ప్రధాని మోదీ ఎదురుదాడికి దిగారు. 'ఇండియా' కూటమిలో చీలికలు బయటపడతాయనే భయంతోనే విపక్షాలు అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు ముందుకు రాలేదని మోదీ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన బీజేపీ కార్యక్రమాన్ని ఉద్దేశించి మోదీ వర్చువల్‌గా శనివారం ప్రసంగించారు. బెంగాల్‌లోని అధికార తృణమూల్ సహా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. పార్లమెంటులో విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఓడించాం. అవి వ్యాప్తిచేస్తున్న ప్రతికూలతను సైతం ఓడించాం. తమ కూటమిలో చీలికలు బయటపడతాయనే భయంతోనే ప్రతిపక్షాలు ఓటింగ్ కోరుకోలేదు. సభ నుంచి పారిపోయాయని మోదీ విమర్శించారు. మణిపూర్ అంశంపై ప్రతిపక్షాలు చర్చను కోరుకోలేదని, కేవలం దానిపై రాజకీయాలు చేయాలనుకున్నాయని ఎదురుదాడి చేశారు. 'గరీబీ హఠావో' నినాదం తీసుకొచ్చిన కాంగ్రెస్... దేశంలో పేదరికాన్ని పారదోలేందుకు ఏమీ చేయలేదన్నారు. పేదల సమగ్రాభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఇటీవలి పంచాయతీ ఎన్నికల సందర్భంగా బెంగాల్‌లోని ప్రతిపక్షాలను భయపెట్టేందుకుగాను అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ హింస, బెదిరింపులను ఆయుధాలుగా వాడుకుందని ప్రధాని ఆరోపించారు. అయినప్పటికీ తమ పార్టీ అభ్యర్థులను స్థానికులు గెలిపించారని చెప్పారు. బీజేపీ అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీలకు అనుమతి ఇవ్వలేదని, కొందరు ర్యాలీ తీస్తే... వారిపై దాడులు చేశారని, ఇదీ టీఎంసీ రాజకీయమని మండిపడ్డారు.

మణిపూర్ దోషులపై చర్యలేవి?

మోదీపై మమతా బెనర్జీ నిప్పులు

కోల్‌కతా: మణిపూర్‌లో అఘాయిత్యాలకు పాల్పడుతున్న ముష్కరులపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం ఆరోపించారు. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అవినీతిపై మాట్లాడలేరని' ఆమె అన్నారు. ఎందుకంటే ఆయన ప్రభుత్వం 'పీఎం కేర్ ఫండ్, రఫెల్ డీల్, నోట్ల రద్దు వంటి కుంభకోణాలతో చుట్టుముట్టబడి ఉంది' అని తెలిపారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఇక్కడ జరిగిన జీ20 అవినీతి నిరోధక మంత్రుల సమావేశాన్ని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా భారతదేశం కఠిన విధానం అవలంబిస్తుందని ప్రధాని మోదీ చెప్పిన కొన్ని గంటల తర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశంలోని పేద ప్రజలు బతకడం బీజేపీకి ఇష్టం లేనందున ఎటువంటి ఆధారాలు లేకుండా విపక్షాలపై ప్రధాని నిందలు వేస్తున్నారు' అని ఉద్వేగంగా టీఎంసీ అధినేత అన్నారు. 'ప్రధాని దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారు. దేశంలోని పేదలెవరూ బతకడం బీజేపీకి ఇష్టం లేదు. బీజేపీ ప్రభుత్వంపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నందున ఆయన అవినీతిపై మాట్లాడలేరు. ఇది రఫెల్ విమానాల ఒప్పందం లేదా నోట్ల రద్దు' అని మమత ఆడియో సందేశంలో పేర్కొన్నారు. మణిపూర్‌పై పార్లమెంటులో చర్చను ప్రతిపక్షాలు కోరుకోవడం లేదన్న ప్రధానమంత్రి ఆరోపణను స్పష్టంగా ప్రస్తావించిన మమతా బెనర్జీ...'ఈశాన్య రాష్ట్రంలో దురాగతాలకు పాల్పడిన వారిపై బీజేపీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు' అని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో కూడా గ్రామీణ ఎన్నికల సమయంలో వారు (బీజేపీ) 15 నుంచి 16 మందిని చంపారు. వారు మభ్యపెడుతున్నారు' అని ఆమె ఆరోపించారు.

అది బీజేపీ గూండాల పని: మంత్రి శశి పంజా

రాష్ట్రంలో జరిగిన గ్రామీణ ఎన్నికల సందర్భంగా హింసకు పాల్పడింది 'బీజేపీ గూండాలు' అని, ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లు తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు కాదని పశ్చిమ బెంగాల్ మంత్రి శశి పంజా శనివారం ఆరోపించారు. ప్రధాన మంత్రి శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లో పంచాయతీ రాజ్ పరిషత్‌ను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగిస్తూ, గ్రామీణ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలను భయపెట్టడానికి రాష్ట్రంలోని అధికార పార్టీ 'ఉగ్రవాదం, బెదిరింపులను' ఉపయోగిస్తోందని విమర్శించారు. 'పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ గెలవలేకపోయినందుకా? భయాందోళనలు, బెదిరింపులు ఆరోపించబడుతున్నాయి? పశ్చిమ బెంగాల్‌లో హింసకు పాల్పడింది బీజేపీ' అని మమతా బెనర్జీ పాలనపై ప్రధాన మంత్రి చేసిన ఆరోపణలను ఎదుర్కోవాలని పంజా కోరారు. టీఎంసీ ప్రభుత్వంపై మోదీ ఆరోపణలు అవాస్తవమని పేర్కొంటూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌కు వివిధ పథకాల కింద ఆర్థిక బకాయిలను అందకుండా చేసిందని ఆరోపించారు. మణిపూర్‌ను సందర్శించడానికి అతనికి సమయం లేదు. కానీ పశ్చిమ బెంగాల్‌లోని పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించడానికి సమయం దొరుకుతుంది' అని పంజా చెప్పారు. తూర్పు రాష్ట్రంలో ఆదివాసీలు, దళితులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నది అవాస్తవమని ఆమె అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్‌ల్లో దళితులు, ఆదివాసీలు అఘాయిత్యాలకు గురవుతున్నారని మంత్రి పంజా తెలిపారు.

ఎన్సీఈఆర్టీ కొత్త కమిటీలో సుధామూర్తి

న్యూఢిల్లీ: జాతీయ స్థాయిలో మూడో తరగతి నుంచి 12వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, ప్రణాళికలను ఖరారు చేసేందుకు 'ది నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) ప్రత్యేక కమిటీ 19 మంది సభ్యులతో ఏర్పాటు అయింది. దీనికి ది నేషనల్ సిలబస్ అండ్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కమిటీ (ఎన్ఎస్‌టీసీ)గా పేరు పెట్టారు. కొత్త కమిటీకి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఐఈపీఏ) చాన్సలర్ మహేశ్ చంద్ర పంత్ నేతృత్వం వహిస్తారు. సభ్యులుగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ వివేక్ దేవరాయ, సభ్యుడు సంజీవ్ సన్యాల్, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త చాము కృష్ణశాస్త్రి, సంగీత దర్శకుడు శంకర్ మహదేవన్ తదితరులు ఉన్నారు. ఎన్ఎస్‌టీసీ కార్యనిర్వహణలో సాయానికి నేషనల్ ఓవర్‌సైట్ కమిటీని కూడా ఏర్పాటు చేయగా దీనికి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్ చాన్సలర్ జగ్‌బిర్ సింగ్ నేతృత్వం వహిస్తారు. పాఠశాల సిలబస్‌ని రూపొందించడం, 3 నుంచి 12వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎన్ఎస్‌టీసీ తయారు చేస్తుంది. 1,2 తరగతుల పాఠ్యపుస్తకాలను సవరించేందుకు సలహాలు, సూచనలు ఇస్తుంది. ఎన్ఎస్‌టీసీ రూపొందించే పాఠ్యపుస్తకాలు, పాఠ్యప్రణాళికలను ఎన్సీఈఆర్టీ ప్రచురించి పంపిణీ చేస్తుంది. జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా పాఠశాలల్లో పాఠ్యాంశాల సవరణకు సంబంధించిన వివరాలను జులై 28న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు ది నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీఎఫ్-ఎస్ఈ) పంపిన నేపథ్యంలోనే ప్రత్యేక కమిటీ ఏర్పాటైనట్లు తెలుస్తోంది.

దేశ ప్రయోజనాలకే పెద్దపీట: కేంద్ర మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ: కొన్ని సైద్ధాంతిక కారణాల వల్ల గత ప్రభుత్వాలు దేశ ప్రయోజనాలను త్యాగం చేశాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచ దేశాలతో కలిసి పని చేస్తున్నప్పటికీ దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. శనివారం 'ఆకాశవాణి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలీన విధానాన్ని అవలంబించిన రోజుల నుంచి అత్యంత ఆత్మవిశ్వాసం నిండిన, దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చే వైఖరికి భారత్ మారిన విషయాన్ని వివరించారు. అలీన విధానానికిగల చారిత్రక ప్రాధాన్యాన్ని జైశంకర్ ధ్రువీకరించారు. భారత విదేశాంగ విధానంలో ప్రత్యేక శకానికి అలీన విధానం ప్రాతినిధ్యం వహించిందని, అయితే దాని పరిమితులు దానికి ఉన్నాయని చెప్పారు. అది మన సామర్థ్యాలు పరిమితంగా ఉన్న సమయమని, అంతేకాకుండా దేశ ప్రయోజనాలకు ఎల్లప్పుడూ పెద్ద పీట వేయని కాలమని చెప్పుకొచ్చారు. కొన్నిసార్లు మనకు దక్కవలసిన ప్రయోజనాలు పొందలేకపోయామన్నారు. కానీ అది గడిచిన కాలమని వ్యాఖ్యానించారు. 1990వ దశకంలో ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలు దేశ విదేశాంగ విధానాన్ని మార్చుకోవలసిన అవసరాన్ని తీసుకొచ్చాయన్నారు. ఆర్థిక, దౌత్యపరమైన వ్యూహాల మధ్య విడదీయలేని బంధాన్ని గుర్తిస్తూ ఈ మార్పులు చేయవలసిన అవసరం ఏర్పడిందన్నారు.

నీట్ వ్యతిరేక బిల్లును ఆమోదించబోను

తమిళనాడు గవర్నర్ రవి

చెన్నై: నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును ఆమోదించే ప్రసక్తేలేదని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి తేల్చిచెప్పారు. నేషనల్ ఎంట్రన్స్, ఎలిజిబిలిటీ టెస్ట్ (నీట్) ఉండాల్సిందేనని నొక్కిచెప్పారు. 'ఈ బిల్లు నేను ఎప్పటికీ ఆమోదించబోను. పిల్లల్లో మేధో వైకల్యాన్ని కోరుకోను. పోటీతత్వం ఉత్తమం' అని తెలిపారు. రాజ్‌భవన్‌లో యూజీ-2023లో నీట్ టపర్లతో భేటీలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు. నీట్ నిషేధానికి అంగీకరించాలని తల్లిదండ్రులు కోరగా ఎట్టిపరిస్థితుల్లోనూ అది జరగదని ఆయన స్పష్టంచేశారు. 'అదిప్పుడు రాష్ట్రపతి పరిశీలనకు వెళ్లింది. దానిపై నిర్ణయాధికారం రాష్ట్రపతికి ఉంటుంది' అని రవి తెలిపారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లితేనే నీట్‌లో అర్హత సాధిస్తారన్నది అవాస్తవమని, సీబీఎస్ఈ సిలబస్ చాలా మంచిదని, అంతటి నాణ్యతా ప్రమాణాలు అవసరమని చెప్పడమే ఇక్కడ ఉద్దేశమని ఆయనన్నారు. సీబీఎస్ఈ అన్నింటికీ అతీతమేమీ కాదని, కోచింగ్ ఇనిస్టిట్యూట్లకు వెళ్లకుండానే చాలా మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. నీట్ కొనసాగుతుందని, దీనిపై గందరగోళం వద్దని రవి అన్నారు. తమిళనాడును నీట్ నుంచి మినహాయించేలా బిల్లును రాష్ట్ర అసెంబ్లీ గతేడాది ఆమోదించగా, దానిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన విషయం తెలిసిందే.

తెలంగాణలో ఫాక్స్‌కాన్ 550 మిలియన్ డాలర్ల పెట్టుబడి

హైదరాబాద్ : తెలంగాణలో 400 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు ఎఫ్ఐటీ హెూన్ టెంగ్ లిమిటెడ్ (ఫాక్స్‌కాన్) డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిందని ఫాక్స్‌కాన్ ఇండియా ప్రతినిధి వీ.లీ ధృవీకరించారు. ఫాక్స్‌కాన్.. ఆపిల్‌కి కీలక సరఫరాదారు. ఎఫ్ఐటీ సింగపూర్‌కు చెందిన చాంగ్‌యి ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌లో 400 మిలయన్ డాలర్ల పెట్టుబడి పెట్టే ప్రణాళికను ఎఫ్ఐటీ హెూన్ టెంగ్ ఇటీవల హాంగ్‌కాంగ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో బహిర్గతం చేసింది. తెలంగాణ పురోగతి, పెట్టుబడి పెట్టే అంశాన్ని వీలీ సోషల్ మీడియాలో అప్‌డేట్‌ను పంచుకున్నారు. వీలీ పోస్ట్‌పై స్పందిస్తూ తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు సంతోషం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. తాజా పెట్టుబడి ప్రతిపాదన ఇంతకు ముందు చేసిన 150 మిలియన్ డాలర్లతో కలిపి 550 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడం ఆనందంగా ఉంది. ఇది తెలంగాణ పురోగతిని మరింత శ్రీఘ్రగతిగా వేగాన్ని అందుకుంటుందని రుజువు చేస్తుంది అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ మేజర్ ఫాక్స్‌కాన్ ఇంటర్ కనెక్ట్ టెక్నాలజీ మేలో తెలంగాణలో తన 500 మిలియన్ డాలర్ల పెట్టుబడిలో భాగంగా రాష్ట్రంలో కొ్త ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రానికి పునాది వేసింది. ఇక్కడికి సమీపంలోని కొంగ కలాన్‌లో ప్రతిపాదిత ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రం తైవాన్ సంస్థ గ్లోబల్ విస్తరణ వ్యూహానికి ఒక మైలురాయిగా దాని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ బేస్‌ను వైవిధ్యపరచడంపై ఒక పత్రికా ప్రకటనలో ఇంతకు ముందు తెలిపింది. ప్రతిపాదిత సదుపాయం తెలంగాణలో ఫాక్స్‌కాన్ ఇంటర్ కనెక్ట్ టెక్నాలజీ కార్యకలాపాలకు కేంద్రంగా పని చేస్తోందని సంస్థ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడానికి వీలు కల్పింస్తోందని పేర్కొంది. ఈ ఏడాది ఆరంభంలో ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్ చైర్మన్ యంగ్ లీయు తన సీనియర్ అధికారులతో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావును కలిశారు.

మూడు ప్రభుత్వరంగ బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచాయ్..



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ బ్యాంకులైన బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్ తమ వడ్డీ రేట్లను పెంచినట్లు తెలిపాయి. రుణాలకు ప్రామాణికమైన వడ్డీ రేట్లలో ఒకటైన నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎక్స్ఎల్ఆర్)ను 0.10 శాతం వరకు పెంచాయి. దీంతో ఐసీఎల్ఆర్ అనుసంధానిత రుణాల ఈఎంఐలు మరింత భారం కానున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా ఏడాది కాలపరిమితి సీటీఎల్ ఆర్‌ను 8.65 శాతం నుంచి 8.70 శాతం పెంచింది. నిన్నటి (శనివారం) నుంచి కొత్త రేటు అమల్లోకి వస్తుందని బ్యాంక్ ఓ ప్రకటనలో తెలిపింది. కెనరా బ్యాంక్ కూడా ఐసీల్ ఆర్‌ను 0.05 శాతం పెంచి 8.70 శాతం చేర్చింది. అయితే బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఏడాది కాలపరిమితి ఎల్ఆర్‌ను 0.10 శాతం పెంచింది. దాంతో రేటు 8.50 శాతం నుంచి 8.60 శాతానికి చేరుకుంది. పెంచిన రేటును (ఆగష్టు 10) గురువారం నుంచి ఆమల్లోకి వస్తుందని తెలిపింది. గురువారంతో ముగిసిన ద్రవ్యపరపతి సమీక్షలో భాగంగా ఆర్‌బీఐ రెపో రేటును యథాతథంగా కొనసాగించేందుకు బ్యాంకుల్లో లభ్యతను తగ్గించేందుకు 10 శాతం ఇంక్రిమెంట్ సీఆర్ఆర్ విధించింది. దాంతో బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత రూ.లక్ష కోట్లకు పైగా తగ్గుదల ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది.

2024 చివరికి చాట్‌జీపీటీ దివాలా ?

న్యూఢిల్లీ : క్షణం క్షణం టెక్నాలజీ రంగంలో మారుతున్న సాంకేతికతపై ప్రపంచ వ్యాప్తంగా టెక్ కంపెనీలు దృష్టి పెడుతున్నాయి. భవిష్యత్తు మొత్తం కృత్రియ మేధస్సు ఆధారంగా నడిచే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. అయితే తాజాగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారంగా పని చేస్తే ఓపెన్ ఏఐ చాట్‌జీపీటీ యాప్ గురించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం ఈ యాప్‌పై ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపించడం లేదని ఒక నివేదిక పేర్కొంది. అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ నివేదిక ప్రకారం చాట్‌జీపీటీ ప్రారంభమైన మొదట్లో భారీగా ఆదరణ అభించగా ఇటీవల కాలంలో భారీ క్షీణతను ఎదుర్కొంటుంది. ఈ నివేదిక ప్రకారం చాట్‌జీపీటీని నవంబర్ 2022లో ప్రారంభమైనపుడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న యాప్‌గా అవతరించింది. కాని ప్రస్తుతం భారీగా క్షీణిస్తుంది. మే నెలతో పోలిస్తే, జూన్,జులై నెలల్లో చాట్‌జీపీటీ వెబ్‌సైట్ యూజర్ క్షీణతను చూసిందని నివేదిక పేర్కొంది. జులై నెలలో 9.6 శాతం క్షీణత కనిపించగా జూన్‌లో 9.7 శాతం క్షీణత నమోదైంది.

సోషలిజాన్ని ముందుకు తీసుకెళ్లాలి

- వినయ్ విశ్వం పిలుపు
- ఘనంగా ఏఐఎస్ఎఫ్ 88వ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ: విద్యార్థులు శాస్త్రీయ విధానాలను అలవర్చుకోవాలని, సోషలిజాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వినయ్ విశ్వం ఉద్బోధించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య 88వ వ్యవస్థాపక దినోత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగాయి. విజయవాడ దాసరి భవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో వినయ్ విశ్వం మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో విద్యార్థి సంఘం కీలకపాత్ర పోషించిందన్నారు. విద్యను కాషాయీకరణ చేయటం, శాస్త్రీయ ఆలోచనలు చేయకుండా తిరోగమనంలోకి విద్యార్థి లోకాన్ని నెడుతున్న పాలకులకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ స్ఫూర్తితో యువత తమ సమస్య పరిష్కారానికి పోరాడాలని సూచించారు. పిల్లలు చదువుకోవటానికి అవకాశాలు కల్పించాలని, చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. చదువు కోసం పోరాడు..చదువుతూ పోరాడు అనే నినాదంతో విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ ఉద్యమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. నూతన విద్యా విధానంపై ఉద్యమిద్దామన్నారు. తొలుత ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర మాజీ కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆవిష్కరించారు. శంకర్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో చరిత్రను కేంద్రం తిరగరాస్తోందని విమర్శించారు. గాంధీ చరిత్రను, డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి మతోన్మాదులైన వీర సావర్కర్, హెడ్గేవాల్ చరిత్రలు రాస్తున్నారన్నారు. తొలి ప్రధాని నెహ్రూ చేతులు మీదుగా ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరణ జరిగిందని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షులు చంద్రనాయక్ అభ్యుదయ గీతాలు ఆలపించి విద్యార్థుల్లో ఉత్సాహం రేకెత్తించారు. వేడుకల్లో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోవాధికారి ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.

గుంటూరు జిల్లాలో: గుంటూరులోని టీజేపీఎస్ కాలేజీ వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. హిందూ కళాశాల వద్ద జరిగిన వేడకల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మహంకాళి సుబ్బారావు పాల్గొన్నారు. ఏసీ కాలేజీ వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ మహిళా కన్వీనర్, ఐఏఎల్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కుమారినంద జెండా ఎగురవేశారు.

ప్రకాశం జిల్లాలో: ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన బహిరంగ సభలో ఏఐఎస్ఎఫ్ మాజీ అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో 50శాతం సీట్లు అమ్మకానికి పెట్టి విద్యా వ్యవస్థకు తూట్లు పొడిచిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు సయ్యద్ మమమ్మద్ కైఫ్ జ్ఞాపకార్థం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

న్యాయం జరిగే వరకు పోరాడదాం

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-మచిలీపట్నం: అగ్రిగోల్డ్ బాధితుల కష్టాలు తొమ్మిదేళ్లయినా తీరలేదని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. అసోసియేషన్, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల అధ్వర్యంలో ఈశ్వర్ రెసిడెన్షియల్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అనంతరం ముప్పాళ్ల మీడియాతో మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు చెప్పే మాటలను అధికారంలోకి వచ్చిన తరువాత నిలబెట్టుకోలేకపోతున్నాయని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పుడు అగ్రిగోల్డ్ అంశాన్ని ప్రతి కేబినెట్ సమావేశంలో చర్చించే వారన్నారు. తెలంగాణ హైకోర్టులో వారం వారం అగ్రిగోల్డ్ సమస్యపై విచారణ జరిగిన విషయాన్ని ముప్పాళ్ల గుర్తు చేశారు. తాము ఆమరణ దీక్ష చేస్తే... దిగి వచ్చిన ప్రభుత్వం ప్రతి నెలా రూ.300 కోట్ల చొప్పున ఇస్తామని చెప్పి...అమలు చేయలేకపోయిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 19 లక్షల మందికి పైగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితులకు ఎన్నికల సమయంలో జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీతో 98 శాతం మంది ఓట్లు వేశారని చెప్పారు. రూ.20 వేల లోపు ఉన్న బాధితులకు రూ.1183 కోట్లు కేటాయించి వారంలోనే జమ చేస్తానని నాడు జగన్ హామీ ఇచ్చారన్నారు. అయితే రూ.20వేల లోపు బాధితులకు పూర్తిగా న్యాయం జరగలేదన్నారు. ఆపై ఉన్న వారికి కూడా ఆరు నెలల వడ్డీతో సహా చెల్లిస్తామన్నారని గుర్తుచేశారు. అయితే నాలుగేళ్లు గడిచినా జగన్ ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు తక్షణం న్యాయం చేయకపోతే రానున్న రోజుల్లో నిరసన గళాలు మరింత పెరుగుతాయని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముప్పాళ్ల వెంట సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.గగన్ ఉన్నారు.

మోదీ కొనసాగితే కష్టాలే

- కార్మికవర్గం సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే మార్గం
- ఏఐటీయూసీ విశాఖ జిల్లా 13వ మహాసభలో ఓబులేసు

విశాలాంధ్ర-విశాఖ: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే పేద, మధ్యతరగతి ప్రజలు మరిన్ని కష్టాలు ఎదుర్కోవలసి వస్తుందని, అందువల్ల దేశ్ కీ బచావో-మోదీ హటావో నినాదంతో పది కేంద్ర కార్మిక సంఘాలు, 450 స్వతంత్ర ఫెడరేషన్లు, 650 రైతు సంఘాలు ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు చెప్పారు. ఏఐటీయూసీ విశాఖ జిల్లా 13వ మహాసభల సందర్భంగా సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కార్మిక ప్రదర్శన నిర్వహించారు. జిల్లా 13వ మహాసభ సూచికగా 13 ఏఐటీయూసీ జెండాలను చేతబూనిన కార్మికులు ప్రదర్శన అగ్రభాగాన నిలబడ్డారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఓబులేసు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం సంక్షోభంలోకి వెళ్లిందని విమర్శించారు. 14 మంది ప్రధానులు రూ.55 లక్షల కోట్ల అప్పులు చేస్తే మోదీ ఒక్కరే రూ.155 లక్షల కోట్ల అప్పులు చేసి దేశాన్ని రుణ భారత్‌గా మార్చారని దుయ్యబట్టారు. గత ప్రధానులు దేశంలో 360 ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేస్తే, మోదీ హయాంలో వాటిని అమ్మడమే తప్ప కొత్తగా ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. దేశ పరిస్థితి ఇలా ఉంటే, ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందని, ప్రపంచానికి భారత్ విశ్వ గురువు అని అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథంలో ఉంటే ఆకలి సూచీలో 123వ స్థానంలో ఎందుకుందని నిలదీశారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ఒక్కొకటిగా విక్రయిస్తున్న మోదీ కన్ను విశాఖ స్టీల్ ప్లాంట్‌పై పడిందని, దీన్ని రక్షించుకునేందుకు కార్మికులు తీవ్ర పోరాటం చేస్తున్నా కనీస స్పందన లేదని, అమ్మేస్తాం, లేదంటే మూసేస్తాం అని చెప్పటం దారుణమని అన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో దేశంలోని వ్యవస్థలను మోదీ భ్రష్టు పట్టించారని, ఆయన ఎక్కువకాలం అధికారంలో కొనసాగితే దేశం అస్తవ్యస్తమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్, ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు మోదీ జపం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ కేసుల నుంచి తప్పించుకోవడానికి మోదీ జపం చేస్తుండగా... చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు జగన్‌ని ఎలా ఇంటికి పంపాలా అని ఆలోచిస్తున్నారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని నిలదీయడం లేదని, వారికి ఇతర సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. మోదీ పాలనలో అదానీ, అంబానీకే మేలు జరుగుతోందని, సామాన్యులు కష్టాలు ఎదుర్కొంటున్నారని, పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, రైతులకు గిట్టుబాటు ధర లేదని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కార్మికుల వలసలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పూర్తిగా విస్మరించిందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడాలని డిమాండ్ చేశారు. దేశంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రైల్వేలో 2.40 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా ప్రమాదాలను నివారిస్తామని, రైల్వేలను అభివృద్ధి చేస్తామని ఎలా చెబుతారని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రూ.40 కోట్ల పోర్టు హ్యాండ్లింగ్ చార్జీల బకాయి చెల్లించాల్సి ఉందంటూ దానికి 20 రెట్లు విలువైన కోకింగ్ కోల్‌తో వచ్చిన నౌకలను అదానీ గంగవరం పోర్టు సముద్రంలోనే నిలిపివేసిందని తెలిపారు. గంగవరం పోర్టు ఏర్పాటు కోసం 1,200 ఎకరాలను విశాఖ స్టీల్ ప్లాంట్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ కొన్ని సంవత్సరాలలో ప్రభుత్వ పరం కావలసిన గంగవరం పోర్టును అదానీకి అక్రమంగా అమ్మేశారని విమర్శించారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు నూతన కనీస వేతనాల జీవోను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతోందని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను అభివృద్ధి చేయకుండా విక్రయిస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపకపోతే కార్మిక వర్గం మరింతగా నష్టపోతుందన్నారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖను ప్రధాని మోదీ లాజిస్టిక్ బిజినెస్ సెంటర్‌గా పేర్కొన్నారని, ఆరు లైన్ల రహదారికి శంకుస్థాపన చేశారని, లాజిస్టిక్ బిజినెస్ కేంద్రంగా విశాఖ నుంచి ఖనిజాలను పెద్ద ఎత్తున ఎగుమతి చేసేందుకు కేంద్రం యోచిస్తోందని, అదే జరిగితే విశాఖకు బూడిద తప్ప ఏమీ మిగలదన్నారు. గంగవరం పోర్టు కాలుష్యంతో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై పార్లమెంటు సభ్యులు నోరెత్తడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్, ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, పవన్, బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దంటూ కేంద్రానికి లేఖ రాసే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేన్ మాట్లాడుతూ విశాఖ పోర్టులో బెర్తును తీసుకున్న అదానీ యాజమాన్యం ఏడాది పాటు నడిపి వదిలేసిందని, దానికోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చేసిన రుణాన్ని చెల్లించబోమని చెబుతున్నారని వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కోకింగ్ కోల్ దిగుమతి చేసేందుకు అదానీ గంగవరం పోర్టుకు వచ్చిన రెండు నౌకలను సముద్రంలోనే ఆపేసి స్టీల్ ప్లాంట్‌కు తీవ్ర నష్టం కలగజేస్తున్నారని, స్టీల్ ప్లాంట్ నష్టపోతే దాన్ని కొట్టేయాలన్న కుట్ర దీని వెనుక దాగి ఉందని విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పడాల రమణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం శ్రమ దోపిడీ చేస్తోందని విమర్శించారు. కార్మిక సంఘాలను భయపెట్టి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని దుయ్యబట్టారు. స్కీమ్ వర్కర్ల కుటుంబాలు పూట గడవని స్థితిలో ఉన్నాయని అన్నారు. ఈ సభలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు, అదనపు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు, ఉపాధ్యక్షులు షేక్ రెహమాన్, కె.సత్యాంజనేయ, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

నా సస్పెన్షన్‌పై త్వరలో కోర్టుకు...

లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి

న్యూఢిల్లీ: వివిధ అవాంఛనీయ సాధనాలను ఆశ్రయించడం ద్వారా విపక్షాల గొంతును నొక్కడానికి బీజేపీ ఉద్దేశపూర్వకంగా రూపకల్పన చేస్తోందని లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి శనివారం ఆరోపించారు. దిగువ సభ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఒక రోజు తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సభ నుంచి తన సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా తాను సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చని, ఈ విషయంలో సంప్రదింపులు కొనసాగుతున్నాయని చౌదరి తెలిపారు. తన సస్పెన్షన్‌ను అధికార పార్టీ 'తిరోగమన చర్య'గా పేర్కొంటూ, 'నన్ను ఉరి తీశారు. ఆ తర్వాత నేను విచారణను ఎదుర్కోవలసి ఉంటుంది' అనే 'విచిత్ర' పరిస్థితిలో తనను ఉంచారని అన్నారు. తనతో సహా నలుగురు ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం గురించి అడిగిన ప్రశ్నకు చౌదరి ఇది కొత్త దృగ్విషయమని అన్నారు. విపక్షాల గొంతు నొక్కేందుకు అధికార పక్షం ఉద్దేశపూర్వకంగా కుట్ర పన్నిందని, అవి నాపై ప్రయోగించకూడదని అన్నారు. 'అయితే సభాధ్యక్ష స్థానానికి సంబంధించి అన్ని గౌరవాలతో, నేను ఆ అధ్యక్ష స్థానం దిశను వ్యతిరేకించలేనని చెప్పాలి. కానీ ఈ రకమైన పరిస్థితిని కోర్టు ద్వారా పరిష్కరించవచ్చని నేను కనుగొంటే, నేను కూడా ప్రయత్నించవచ్చు' అని పశ్చిమ బెంగాల్‌లోని బహరంపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీగా ఉన్న అధిర్ తెలిపారు. సుప్రీం కోర్టును ఆశ్రయించాలా వద్దా అనే అంశంపై సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. 'నేను త్వరలో కోర్టును ఆశ్రయిస్తాను' అని చౌదరి చెప్పారు.

కోనేరు భూకమిటీ సిఫార్సులు అమలు చేయాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్

విశాలాంధ్ర-విజయవాడ: కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా 23వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈడుపుగల్లులో శనివారం జరిగిన ఈ మహాసభకు అధ్యక్షత వర్గంగా మేరుగు విజయకుమార్, కంచర్ల ప్రభుకుమారి, నాగేశ్వరరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆవుల శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో భూమి లేని ప్రతి వ్యవసాయ కార్మికునికి ఒక హెక్టారు భూమి పంపిణీ చేయటానికి కావలసినంత ప్రభుత్వ భూమి ఉందని, వెంటనే కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. భూమి కోసం పేదలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవని, తక్షణం వసతులు కల్పించి గృహ నిర్మాణం కోసం లబ్ధిదారులకు సిమెంట్, ఇసుక ఉచితంగా సరఫరా చేసి రూ.5 లక్షల రుణాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతో పాటు గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం సాధించిన విజయంలో భాగంగానే సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సభలో సీపీఐ కృష్ణాజిల్లా సమితి ఇన్‌ఛార్జ్ కార్యదర్శి టి.తాతయ్య, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, రైతు నాయకులు సురేంద్రనాథ్ బెనర్జీ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్దు రత్నకుమారి ప్రసంగించారు. తొలుత ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి నాయకులు ఆర్.పిచ్చయ్య చైతన్య గీతాలు ఆలపించారు. సీపీఐ పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి మున్నంగి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ కార్మిక సంఘం పెనమలూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు మత్రి ముత్యాలు బీకేఎంయూ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఘంటాల ఆదిశేషు, దగాని సంగీతరావు, వంగపండు, గద్దర్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం జిల్లా 23వ మహాసభ 25 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకొని నూతన కమిటీ ఏర్పడింది.

శ్రీనగర్‌లో మిగ్-29 మోహరింపు

శ్రీనగర్: గాల్వాన్ ఘర్షణ అనంతరం భారత్ సరిహద్దుల్లో గస్తీని ముమ్మరం చేయడంపై భారత్ దృష్టి పెట్టింది. ఇదే క్రమంలో తాజాగా శ్రీనగర్ ఎయిర్ బేస్ వద్ద అప్‌గ్రేడ్ చేసిన మిగ్-29 ఫైటర్ స్క్వాడ్రన్‌ను మోహరించింది. ట్రైడెంట్ స్క్వాడ్రన్‌ను డిఫెండర్స్ ఆఫ్ ది నార్త్ అని పిలువనున్నారు. ఇది శ్రీనగర్ ఎయిర్ బేస్‌లోని మిగ్-21 స్క్వాడ్రన్ స్థానంలో ఉంది. శ్రీనగర్ కాశ్మీర్ లోయ మధ్యలో ఉంది. ఇది మైదాన ప్రాంతాల కంటే అత్యధిక ఎత్తులో ఉంటుంది. సరిహద్దుకు సమీపంలో ఉన్నందున ఎక్కువగా ప్రతిస్పందించే విమానాన్ని ఉంచడం వ్యూహాత్మకంగా మంచిది. మెరుగైన ఏవియానిక్స్, దీర్ఘ-శ్రేణి క్షిపణులతో అమర్చబడి ఉంది. మిగ్-29 ఈ ప్రమాణాలన్నింటినీ నెరవేరుస్తుంది. దీని కారణంగా రెండు వైపులా శత్రువులను ఎదుర్కోగలమని వైమానిక దళ పైలట్ స్క్వాడ్రన్ లీడర్ విపుల్ శర్మ తెలిపారు. పబ్లిక్ అథారిటీ ద్వారా మిలిటరీకి అందించిన సంక్షోభ సముపార్జన సామర్థ్యాలను ఉపయోగించి ఘోరమైన ఆయుధాలతో దాడి చేయడంలో ఇవి ప్రావీణ్యం కలిగి ఉన్నాయి. వివాద సమయాల్లో శత్రు విమానాల సామర్థ్యాలను అడ్డుకునే సామర్థ్యం కూడా ఈ యుద్ధ విమానాలకు అందించబడి ఉందని అధికారులు తెలిపారు. మరో పైలట్, స్క్వాడ్రన్ లీడర్ శివం రాణా మాట్లాడుతూ.. అప్‌గ్రేడ్ చేసిన విమానం రాత్రిపూట విజన్ గాగుల్స్‌తో సాయంత్రం పని చేయగలదని, దాని వైమానిక ఇంధనం నింపే సామర్థ్యం కారణంగా మరింత విస్తరించిన భూభాగాన్ని కలిగి ఉందని చెప్పారు. "మేము ఎయిర్-టు-గ్రౌండ్ ఆయుధాలను కూడా చేర్చాము, ఇది ఇంతకు ముందు లేదు. ఈ విమానం అతిపెద్ద సామర్థ్యం పైలట్‌లు, ఈ విమానాలలో సేవలందించడానికి భారత వైమానిక దళం ఎంపిక చేసింది," అని వివరించారు. మిగ్29 జనవరిలో శ్రీనగర్ వైమానిక స్థావరానికి తరలించారు.

మణిపూర్ అత్యాచార బాధితులకు సంఘీభావంగా

పంజాబ్‌లో మహిళల భారీ ర్యాలీలు

మొహాలి: మణిపూర్‌లో అల్లర్లు, హింస, మహిళలపై ఆకృత్యాలకు నిరసనగా ఈశాన్య రాష్ట్రంలోని అత్యాచార బాధితులకు సంఘీభావంగా పంజాబ్‌లో మహిళల భారీ ర్యాలీలు జరిగాయి. దోషులను ఉపేక్షించరాదని, కఠిన శిక్షలను అమలు చేయాలని, గిరిజనుల హక్కులను పరిరక్షించాలని, అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రదర్శనకారులు డిమాండ్ చేశారు. కేంద్ర-రాష్ట్ర డబుల్ ఇంజిన్ 'బీజేపీ' ప్రభుత్వాలే మణిపూర్‌లో హింసకు బాధ్యులని దుయ్యబట్టారు. కేవలం మణిపూర్, పంజాబ్ కోసమే కాదు యావత్ దేశ మహిళామణుల తరఫున గొంతెత్తుతున్నట్లు వెల్లడించారు. ఉన్నావో, హత్రాస్, కథువా తరహా ఘటనలతో మహిళలపై అత్యాచారాల గురించి తమ ఆలోచన ఏమిటో బీజేపీ నేతలు బహిర్గతం చేశారని గుర్తుచేశారు. దళితులు, మైనారిటీలు, గిరిజనులు, మహిళలకు హిందూత్వ సిద్ధాంతంలో స్థానం లేదని, 2024 ఎన్నికల్లో లబ్ధి కోసమే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ మతరాజకీయా లకు తెరతీశారని స్త్రీ జాగృతి మంచ్, పంజాబ్ నేత అమన్ డియోల్ ఆరోపించారు. ఇదిలావుంటే సంగ్రూర్, పాటియాలా, మాలర్‌కోట్ల, మొహాలి, బర్నాలా, లూథియానా, మాన్సా, భటిండా, మొగా, ఫరీద్‌కోట్, జలంధర్, ఫతేఘర్ సాహిబ్‌లో మణిపూర్‌కు మద్దతుగా భారీ ప్రదర్శనలు కొన్ని వారాలుగా జరుగుతున్నాయి. సామాజిక సంఘాలు, విద్యార్థులు, కళా కారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. 100కుపైగా ర్యాలీలు ఇప్పటికే జరిగాయి. మణిపూర్ ప్రజలు, మహిళల వెతలను వర్ణిస్తూ ఇంటింటి ప్రచారాన్ని పంజాబ్ లోక్‌మంచ్ చేపట్టింది. వీధి సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. గతంలో తెచ్చిన నాలుగు నల్ల సాగు చట్టాల మాదిరిగా మణిపూర్‌లో గిరిజనల అడవులు, భూములను లాక్కొనేలా చట్టాలను తెస్తున్నారని, గిరిజనుల భూములను బడా కార్పొరేట్లకు దారాదత్తం చేయాలని, సామాన్యులను దోచుకునేలా వారికి ద్వారాలు తెరవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా మహిళల ర్యాలీలు పంజాబ్‌వ్యాప్తంగా పెద్దఎత్తున సాగుతున్నాయి. అంబ్ సాహిబ్ గురుద్వారా వద్దకు 20 జిల్లాల నుంచి మహిళలు చేరుకొని చండీగఢ్‌లోని గవర్నర్ భవనం వరకు మార్చ్ నిర్వహించారు. అయితే బురైల్ జైల్ వద్ద వారిని నిలువరించడంతో గవర్నర్‌కు ఏడీసీకి వినతిపత్రాన్ని సమర్పించారు. దోషులకు కఠిన శిక్షలు అమలు చేయాలి, అటవీ సంరక్షణ (సవరణ) చట్టం, 2023ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 6న బీకేయూ (ఏక్తా-ఉగ్రాహన్) నేతృత్వ ర్యాలీలో 25వేల మంది పాల్గొని మణిపూర్ బాధితులకు సంఘీభావాన్ని ప్రకటించారు.

విశాలాంధ్ర దినపత్రికకు
71వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కొమ్ము ప్రసాద్ - ఎస్‌టీయూ రాష్ట్ర నాయకులు
ఎం.వి.ఎస్.ఎన్.ప్రసాద్ - ఎస్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి
డి.చంద్రశేఖర్ - ఎస్‌టీయూ రాష్ట్ర నాయకులు
ఎం.వి.శ్రీనివాస్ - ఎస్‌టీయూ కృష్ణాజిల్లా అధ్యక్షులు
ఎ.సత్యవంతు - ఎస్‌టీయూ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు
యు.టైటస్ పాల్ - ఎస్‌టీయూ పెనమలూరు మండల అధ్యక్షులు
పి.వి.కృష్ణమోహన్ - ఎస్‌టీయూ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు
పి.సుగుణాకరరావు - ఎస్‌టీయూ కృష్ణాజిల్లా కౌన్సిలర్
కె.మాధవరావు - ఎస్‌టీయూ కృష్ణాజిల్లా ఆర్థిక కార్యదర్శి
యు.కృష్ణమూర్తి - ఎస్‌టీయూ కృష్ణాజిల్లా కార్యదర్శి
పి.గోపాలకృష్ణ - ఎస్‌టీయూ కృష్ణాజిల్లా సెక్రటరీ
పి.ఇమ్మానుయేలు - ఎస్‌టీయూ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి
ఎస్.కిరణ్‌బాబు - ఎస్‌టీయూ మచిలీపట్నం టౌన్ ప్రెసిడెంట్
వి.గంగరాజు - ఎస్‌టీయూ మచిలీపట్నం టౌన్ జనరల్ సెక్రటరీ
ఎం.వీరబాబు - ఎస్‌టీయూ మచిలీపట్నం టౌన్ ఆర్థిక కార్యదర్శి

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.